
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శనివారం 10 ఆగస్టు 2024 | 5



జాయింట్ కలెక్టర్‌గా చినరాముడు

రాజమహేంద్రవరం,ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) :జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి ఎస్.చినరాముడు నియమితులయ్యారు.ఈ మేరకు శుక్రవారం రాత్రి సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.2018 బ్యాచ్ కు చెందిన రాముడు ఎస్సీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. గత నెలలో జేసీ ఎస్.తేజ్‌భరత్‌ను బదిలీ చేసి హిమాన్స్ కౌశిక్‌ను జేసీగా నియమించినా చేరలేదు. దీంతో రాముడును నియమించారు.



సచివాలయాలకు.. చంద్రోదయం

ప్రక్షాళనకు సీఎం చంద్రబాబు నిర్ణయం

- ఉద్యోగుల సర్దుబాటుకు యోచన
- ఇక ఒక్కో సచివాలయానికి ఐదుగురే?
- మాతృశాఖలకు మిగిలిన ఉద్యోగులు
- జిల్లా వ్యాప్తంగా 512 సచివాలయాలు
- మొత్తంగా 3900 మంది సిబ్బంది
- విధివిధానాలపై దృష్టి పెట్టిన కూటమి
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామ,వార్డు సచివాలయాల్లో ఒక పనీ లేదు.. పద్ధతీ లేదు..సచివాలయాలకు రావడం వెళ్లడం అంతే.. మొత్తం సచివాలయాల్లో 11 మంది ఉంటే ఒకరిద్దరు మినహా మిగిలిన వారంతా ఖాళీయే..అయినా అలాగే జీతాలు చెల్లించారు.. అయితే కూటమి వచ్చింది.. పనితీరు మార్చింది.. సచివాలయ ఉద్యోగులకు పనిచెప్పింది..ఒకటో తేదీనే పించన్ల పంపిణీ అంతా వారి చేతుల మీదుగానే సాగుతుంది. ఇప్పుడిప్పుడే సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టే పని ఆరంభించింది. ఈ మేరకు సీఎం చంద్రబాబు అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రస్తావించారు.సచివాలయాలు ప్రక్షాళన చేయాలని నిర్ణయించారు. అవసరమైన మేరకు సిబ్బందిని మాత్రమే సచివాలయాల్లో కొనసాగించి మిగతా వారిని మాతృ శాఖలకు పంపించాలని యోచిస్తున్నారు. దీంతో ఆ సిబ్బంది లో ఆనందం వ్యక్తమవుతోంది.

సచివాలయానికి ఐదుగురు ఉండేలా..

జిల్లాలో మొత్తం 512 సచివాలయాలు ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లోని వార్డు సచివాలయాలు 119, గ్రామ సచివాలయాలు 393 ఉన్నాయి. మొత్తం సిబ్బంది 3900 మంది ఉన్నారు. ఇప్పుడు ప్రస్తుతానికి సచివాలయంలో 8 మంది సిబ్బంది ఉన్నారు.ఈ సంఖ్యను క్రమబద్ధీకరించాలని సూచనప్రాయంగా నిర్ణయించింది. దీనిలో భాగంగా గ్రామాల్లో ఏఎన్ఎం, వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్, సంక్షేమ కార్యదర్శి మహిళా సంరక్షణ కార్యదర్శులను కొనసాగించి మిగిలిన వారిని మాతృ శాఖలకు అప్పగించాలని యోచన చేస్తున్నారు. వార్డు సచివాలయాల్లో అడ్మిన్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్, సంక్షేమ కార్యదర్శి శాని టేషన్ కార్యదర్శి, ఏఎన్ఎం, మహిళా సంరక్షణ కార్యదర్శులను కొనసాగిస్తారు. మిగిలిన వారిని మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖకు అప్పగిస్తారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్,అగ్రికల్చర్/హార్టికల్చర్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్ అసిస్టెంట్, పశు సంవర్ధక సహాయకుల పోస్టులను రద్దు చేయనున్నారు. వారిని క్లస్టర్ విధానంలో మాతృశాఖల ఆధీనంలోకి తీసుకెళతారని సమాచారం. మాతృశాఖలకు వెళితే ఉద్యోగోన్నతులకు అవకాశం ఉంటుందని ఉద్యోగులు ఆనంద పడుతున్నారు.

ఆ శాఖకు ఇన్‌చార్జి ఎవరు?

గ్రామ, వార్డు సచివాలయాలకు జిల్లా అధికారి పోస్టును సృష్టించారు. కానీ దానికి అధికారిని నియమించకుండా డీఎల్‌డీవోలు, డీఆర్‌డీఏ పీడీలకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కాలం గడిపారు. అభివృద్ధి విభాగానికి జాయింట్ కలెక్టర్ ఉండేవారు.వారు సచివాలయ బాధ్యతలు చూసుకునే వారు.కానీ తర్వాత ఆ పోస్టును పట్టించుకోలేదు. పంచాయతీ రాజ్ శాఖలోని ఎండీవోలకు ప్రమోషన్ ఇచ్చి డీఎల్‌డీవోలుగా నియమించారు. జిల్లాలో రెండు డివిజన్లలో ఇద్దరు డీఎల్ డీవోలకు సచివాలయాల అదనపు బాధ్యత అప్పగించారు. ఇక సచివాలయాల శాఖ ఏ డిపార్టుమెంటు పరిధో ఇప్పటికీ స్పష్టత లేదు. ఈ సమస్యలన్నిటికీ కూటమి ప్రభుత్వం పరిష్కారం చూపనుంది.

నాడు వైసీపీ కార్యకర్తల్లా?

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కి రోజులు దగ్గర పడు తున్న వేళ సచివాలయ సిబ్బంది సర్దుబాటును వైసీపీ ప్రభు త్వం తెరపైకి తెచ్చింది. అప్పటికే సచివాలయ సిబ్బందిని 'అన్ని' పనులకూ వాడేసేవారు. జాబ్ చార్టు ప్రకారం నిర్వర్తించాల్సిన విధుల కంటే.. పార్టీ కార్యక్రమాలకు వినియోగించేశారు. చాలా మంది జగన్ కార్యకర్తలు అని పిలిచేవారు.. ఇదిలా ఉండగా రేషన లైజేషన్(సర్దుబాటు) అంటూ సచివాలయంలోని సిబ్బంది తగ్గింపునకు శ్రీకారం చుట్టారు.ప్రలోభాలు, బెదిరింపులతో ఓట్లు వేయించుకొనే వ్యూహంలో భాగంగా బదిలీల రంగం సిద్ధం చేశారు.తమకు అనుకూలమైన వాళ్లను 'కావాల్సిన చోటు'లో వైసీపీ నాయకులు నియమింపజేసుకున్నారు. ఇలా సచివాలయ సిబ్బంది ప్రజాసేవ కంటే వైసీపీ సేవలోనే తరించే దుస్థితిని తీసుకొచ్చారు. ఒక సచివాలయంలో సంక్షేమ అభివృద్ధి కార్యదర్శి, వార్డు పరి పాలన కార్యదర్శి, విద్యాడేటా ప్రాసెసింగ్ కార్యదర్శి, మహిళ బలహీనవర్గాల భద్రత కార్యదర్శి(మహిళా పోలీస్),ఆరోగ్య కార్యదర్శి, ప్రణాళికా నియంత్రణ కార్యదర్శి, సదుపాయాల కార్యదర్శి, పారిశుధ్య పర్యావరణ కార్యదర్శి, రెవెన్యూ కార్యదర్శి, ఇంధన కార్యదర్శి, అడ్మిన్ ఉంటారు. వీరందరినీ వైసీపీ పనులకే వాడుకోవడం జరిగేది. దీంతో అసలు వారి విధులు సవ్యంగా సాగలేదు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల గురించి ఆలోచించడం.. మాతృశాఖలకు మార్పు చేసే నిర్ణయంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

16న జాంపేట బ్యాంక్ నామినేషన్లు

రాజమహేంద్రవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి) : జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలక వర్గం ఎన్నికలు ఈనెల 25న నిర్వహించనున్నట్టు డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్, ఎన్ని కల అధికారి ఎం.జగన్నాథరెడ్డి తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం 10 బ్రాంచిల పరిధిలో సుమారు 32వేలకు పైగా ఓటర్లు 12 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటా రన్నారు.ఈ నెల 16న ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నామినేషన్ల స్వీకరణ, 17న పరిశీలన, 18న ఉపసంహరణ ఉంటుందన్నారు. 25న ఉదయం 8 నుంచి 4 గం టల వరకూ పోలింగ్ జరుగుతుందని, 26న ఎస్‌కేవీటీ కళాశాలలో ఓట్లను లెక్కిస్తామని చెప్పారు. 27న ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక ఉంటుంద న్నారు.ఈ బ్యాంక్ ఛైర్మన్ పదవి రేసులో బొమ్మన జయకుమార్ ఉన్నారు.



ఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న దిశ, కొవ్వూరు డీఎస్పీలు

ఇద్దరు డీఎస్పీలు బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి)/కొవ్వూరు : దిశ(మహిళా పోలీస్ స్టేషన్) డీఎస్పీగా కడలి వెంకటేశ్వరరావు, కొవ్వూరు డీఎస్పీగా జి.దేవకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇరువురు ఎస్పీ నరసింహ కిశోర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గతంలో వెంకటేశ్వరరావు రాజమహేంద్రవరం నార్త్ జోన్ డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. తర్వాత అనంతపురం డీటీసీకి వెళ్లారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆయనను దిశ డీఎస్పీగా ప్రభుత్వం నియమించింది. డీఎస్పీ దేవకుమార్ 1991 బ్యాచ్ ఎస్ఐగా అమలాపురం టౌన్, ఉప్పలగుప్తం, అయినవిల్లి వై.రామవరం ఏజెన్సీ, రాజమహేంద్రవరం టూ టౌన్ ఎస్ఐగా పనిచేశాను. 2006లో పదోన్నతిపై ఏసీబీ సీఐగా శ్రీకాకుళంలో 2011 వరకు పనిచేశారు. కాకినాడ టౌన్, తాడేపల్లిగూడెం, అమలాపురం రూరల్ సీఐగా పనిచేశారు. డీఎస్పీ పదోన్నతిపై విజయవాడ సీఐడీకి వెళ్లారు.అక్కడి నుంచి కొవ్వూరు డీఎస్పీగా వచ్చారు.

ప్రియుడు మోసగించాడని..
ఇంటర్ బాలిక ఆత్మహత్య 7



ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తదితరులు..

కలెక్టరేట్‌లో గిరిజన బాలికల సంప్రదాయ నృత్యం

గిరిజన విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 9 : గిరిజన విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించి భవిష్యత్తరాలకు ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం ఆర్ట్స్ కళాశాల నుంచి కంబాలచెరువు సెంటర్ వరకు ర్యాలీ చేశారు. ర్యాలీని కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహకిశోర్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. తొలుత గిరిజన విద్యార్థుల సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ మనం ఎక్కడ నుంచి వచ్చాం అన్నదానికంటే ఏమి సాధించాం అనేదే ముఖ్యమన్నారు. గిరిజన విద్యార్థులందరూ లక్ష్యాలకు అనుగుణంగా కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ గిరిజనుల కోసం కేంద్ర ప్రభుత్వం అందించే వందన్ వికాస్ యోజన పథకం జిల్లాలోను అమలు చేయాలన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు లక్ష్యాన్ని సాధించే దిశగా కృషిచేయాలన్నారు. అనంతరం పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు అందించారు. ఈ కార్యక్రమాల్లో ఇన్‌చార్జి జేసీ డీఆర్వో జి.నరసింహులు, రాజమండ్రి ఇన్‌చార్జి ఆర్డీవో కెఎల్.శివజ్యోతి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు కేఎస్.జ్యోతి, అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ మల్లిభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఇసుక..ఖాళీ!

ర్యాంపుల అనుమతులకు ఎదురుచూపులు

- జిల్లా వ్యాప్తంగా ఇసుక కొరత
- స్టాక్ పాయింట్లలో ఖాళీ
- ఇంకా అక్రమంగా నిల్వలు
- కన్నెత్తి చూడని సెబ్ అధికారులు
- నేడు మంత్రి కొల్లు సమీక్ష?

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గోదావరి రేవులన్నీ బోసిపోయాయి. పడవలన్నీ ఒడ్డుకు చేరాయి. మరో పక్క ఇసుక తవ్వకాలు ఆగిపోవడంతో కొరత ఏర్పడింది. కూటమి ప్రభుత్వం ఉచిత విధానంలో ముందుగా స్టాక్ పాయింట్లలోని ఇసుక సరఫరాకు నిర్ణయించడంతో అదీ అయిపోయింది. రాజమహేంద్రవరం డివిజన్‌లో స్టాక్ పాయింట్లన్నీ ఖాళీ అవ్వగా.. కొవ్వూరు డివిజన్‌లో మాత్రం రెండు మూడు రోజులు వరకూ వస్తుందని చెబుతున్నారు.ఈ నేపథ్యంలో ఇసుక తీతకు అనుమతి ఎపుడిస్తారోనని ఒక ప్రక్క ఇసుక వ్యాపారులు, మరో పక్క వినియోగదారులు ఎదురు చూస్తున్నారు.జిల్లాలో రాజమహేంద్రవరం, కాతేరు,సీతానగరం మం డలంలో ఉన్న స్టాక్ పాయింట్లలో ఇసుక అయిపోయింది. కాతేరు, గాయత్రీ ర్యాంపుల్లో నిల్వ ఇసుక ఖాళీ అయింది. ప్రస్తుతం కొవ్వూరు మండలం కుమారదేవం, నిడదవోలు మండలం పెండ్యాల, పెరవలి మండలం ఉసులుమర్రు స్టాక్ పాయింట్లలో ఇంకా కొద్దిగా ఉంది. అధికారులు ఇంకా లక్షా 80 వేల టన్నుల వరకూ ఉంటుందని చెబుతున్నారు. అయితే కాతేరు, వెంకటనగర పరిసర ప్రాంతాల్లో చాటుమాటుగా ఇసుక అక్రమ నిల్వలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. తిరుమల కళాశాల రోడ్డులో అక్కడక్కడా గుట్టలు ఉన్నాయని చెబుతున్నారు.సెబ్ అధికారులుదృష్టిపెట్టకపోవడం గమనార్హం.

జిల్లాలో ఇసుక కొరత..

ఉసులుమర్రు స్టాక్ పాయింట్ వివాదంలో ఉంది. వైసీపీ ప్రభుత్వంలో ఉసులుమర్రు స్టాక్ పాయింట్ పెట్టడానికి ఒక రైతు వద్ద రెండు ఎకరాల భూమికి ఏడాదికి సుమారు లక్షన్నర ఇవ్వడానికి ఒప్పందం పెట్టుకున్నారు. కానీ అతనికి చాలా బాకీ ఉంది. ఇటీవల సదరు భూమి యజమాని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లగా పాత బాకీ తమకు సంబంధంలేదని చెప్పడంతో అతను ఆందోళనకు దిగాడు. ప్రస్తుతానికి నచ్చజెప్పారు. పెండ్యాల స్టాక్ పాయింట్ వద్ద సాధారణ వినియోగదారులకు కాకుండా బల్క్‌గా పెద్ద కంపెనీలకు అమ్మేస్తున్నారనే వాదన ఉంది. కోనసీమలో కూడా ర్యాంపులన్నీ మూత పడడం వల్ల గోదావరి జిల్లాల స్థానిక అవసరాలకు ఇసుక లభ్యం కావడంలేదు.ఇసుక వ్యాపారం మీద ఆధారపడిన లారీ యజమానులు ఇబ్బందులు పడుతున్నారు.అఖండ గోదావరిలో రాజమహేంద్రవరం, కొవ్వూరు వైపున సొసైటీల పేరిట ఇసుక తీసేవారు ఎక్కువ మంది ఉన్నారు. ప్రస్తుతం ఇసుక తీత ఆగిపోవడంతో ఖాళీగా ఉంటున్నారు.గోదావరి చాలా వరకూ తగ్గిందని,ఈ సమయంలో బోట్లలో ఇసుక తీసే అవకాశం ఉంటుందని బోట్స్‌మన్ సొసైటీలు చెబుతున్నాయి. కానీ దీనిపై ఇంకా జిల్లా ఇసుక కమిటీ గానీ,ప్రభుత్వం కానీ ఇంకా ఏ నిర్ణయం తీసుకున్నట్టు లేదు.గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఇసుక దోపిడీపై విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే.ఈ నెలాఖరికి ప్రాథమిక విచారణ పూర్తి కావొచ్చు. గత ప్రభుత్వంలో అక్రమాలను వెలికితీసి..ఇసుకతీత అనుమతులి వ్వడానికి కూటమి ప్రభుత్వం వేచి చూస్తున్నట్టు సమాచారం.

ఇసుక రుచి మరిగారు!?

ఇసుక రుచి మరిగిన వ్యాపారులు కేవలం పేదల పేరిట సొసైటీలను ఏర్పాటు చేసి,రూ.కోట్లు గడించడం గమనార్హం. ఏ పార్టీ అధికారంలో ఉంటే, ఆ పార్టీ వాళ్లతో సాన్నిహిత్యం సంపాదించుకుని,అధికారులతో లాలూచీపడి నిత్యం వ్యా పారం చేస్తుంటారు.ఇటీవల కాతేరు రెండు ర్యాంపుల్లో గతంలో వైసీపీ ఆధ్వర్యంలో దోపిడీ చేసిన ఆర్కే అనే వ్యక్తితో కుమ్మక్కయిన వాళ్లే ర్యాంపులలోని గుట్టలను అధిక ధరల విక్రయించడం గమనార్హం. కేవలం టన్నుకు రూ.420 మాత్రమే తీసుకోవాలని అది కేవలం ఇసుకతీత,లోడింగ్, సీనరేజ్ వంటి ఖర్చులకే అని ప్రభుత్వం చెప్పగా ఇక్కడ లారీకి అదనంగా రూ.5 వేల వరకూ వసూలు చేసినట్టు చెబుతున్నారు. ప్రస్తుతం ర్యాంపులు ఆగడంతో మళ్లీ ఇటువంటి వారంతా ఏదో విధంగా సొసైటీల పేరుతో వీటిని దక్కించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటువంటి అక్రమార్కులపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది.

నేడు మంత్రి కొల్లు రవీంద్ర రాక

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 9 : రాష్ట్ర మైన్స్ అండ్ జియోలాజికల్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర శనివారం జిల్లాలో పర్యటించనున్నారు.కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటలకు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ప్రజాప్రతినిధులు, అధికారులతో మంత్రి సమావేశం నిర్వహిస్తారు.దీనిలో భాగంగా ఇసుక విధివిధానాలపై చర్చిస్తారని తెలిసింది.

సత్యదేవుడి ఎదుట స్వర్ణశోభిత ధ్వజస్తంభం

శాస్త్రోక్తంగా వేద పండితుల పూజలు





రెండు గోపురాల నడుమ ధగధగలాడుతున్న బంగారు ధ్వజస్తంభం.. పూజలు చేస్తున్న పండితులు

అన్నవరం, ఆగస్టు9: సత్యదేవుడి సువర్ణ ధ్వజస్తంభ ఏర్పాటు కార్యక్రమాలు శుక్రవారం శాస్త్రోక్తంగా పండితులు దాత చేతుల మీదుగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం షోడసోపచార పూజలను నెల్లూరుకు చెందిన దాతతో చేయించారు. అనంతరం నూతన ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణ గావించారు. చతుర్వేద పండితులు వేదాశీర్వచనాల అనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు స్వర్ణశోభతో ధగధగలాడాయి. 300 కిలోల రాగిరేకుపై సుమారు 1800 గ్రాముల బంగారం వినియోగించగా, సుమారు రూ.2 కోట్లు వ్యయమైనట్టు దాత పేర్కొన్నారు. ఇన్చార్జి ఈవో రమేష్‌బాబు, పీఆర్వో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, ఆగస్టు9: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన ఈరంకి వెంకటశర్మ రూ.లక్ష విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా, దాతకు ప్రత్యేక దర్శనంతోపాటు ప్రసాదాలు అందజేశారు.

పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత వెంకటశర్మ



పాదగయ పుష్కరిణిలో స్నానాలు





రాజరాజేశ్వరీదేవి, పురుహుతికాఅమ్మవారికి పూజలు

పాదగయలో మహిళల శ్రావణ శుక్రవారం పూజలు

పిఠాపురం, ఆగస్టు9: కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రానికి శ్రావణ శోభతో కళకళలాడింది. ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పుష్కరిణిలో స్నానాలు ఆచరించిన మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి నోము ఆచరించారు. శ్రావణమాసం తొలి శుక్రవారం కావడంతో పాదగయలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. ఇళ్ల వద్ద శ్రావణ శుక్రవారం నోము ఆచరించే మహిళలు తెల్లవారుజాము నుంచే పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. రాత్రి వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. శ్రావణ శుక్రవారం ఆచరించిన మహిళలు ఆలయంలో దీపాలు వెలిగించి పూజలు జరిపారు. ఉమాకుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో కొలువై ఉన్న రాజరాజేశ్వరీదేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమశక్తి పీఠానికి అధిష్ఠాన దేవతయిన పురుహుతికా అమ్మవార్లకు కుంకుమార్చన, పుష్పార్చన, విశేష పూజలు జరిగాయి. అమ్మవార్లతోపాటు కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామిలను భక్తులు దర్శించుకున్నారు. ఉచిత అన్నప్రసాదాలు అందించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈవో, సహాయ కమిషనరు దుర్గాభవానీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ప్రేమ విఫలమై.. బాలిక ఆత్మహత్య



నల్లజర్ల, ఆగస్టు 9: ప్రేమ విఫలం కావడంతో ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నల్లజర్ల మండలం ఘంటా వారి గూడెంలో జరిగింది. ఘంటా వారి గూడేనికి చెందిన పెనుమాక శ్రీనివాసరావు, సుశీల దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా, చిన్న కుమార్తె లక్ష్మి(17) ఇంటర్ ప్రైవేటుగా చదువుతూ దూబచర్లలోని ఓ మందుషాపులో పనిచేస్తోంది. పక్కనే సెలూన్ షాపు నిర్వహిస్తున్న ఉంగుటూరు మండలం ఎర్రమిల్లిపాడు గ్రామానికి చెందిన శ్రీనుతో ప్రేమలో పడింది. ఇద్దరూ తరచు కలుస్తుండేవారు. ఇంట్లో విషయం తెలియడంతో వివాహం చేసుకోవాలని లక్ష్మి ఒత్తిడి చేయగా, శ్రీను మొహం చాటేశాడు. తాను మోసపోయానని మనస్తాపం చెందిన లక్ష్మి తన తల్లిదండ్రులు కూలీ పనికి వెళ్లిన తరువాత మధ్యాహ్నం ఫోన్ చేసి మిమ్మల్ని చివరిసారిగా చూడాలనిపిస్తోంది.. త్వరగా ఇంటికి రండి.. చెప్పింది. తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ విగతా జీవిగా కనిపించింది. స్థానికుల సహకారంతో లక్ష్మిని దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్టు స్థానిక వైద్యులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ స్టాలిన్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలిస్తుండగా బంధువుల అడ్డుకున్నారు. దీంతో సీఐ దుర్గాప్రసాద్ అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ప్రేమికుడు శ్రీను వచ్చి లక్ష్మి కుటుంబానికి న్యాయం చేసేవరకు ఇక్కడే ఉంచాలని మధ్యాహ్నం నుంచి సాయంత్రం 7 గంటల వరకు అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య చర్చలు జరుగుతున్నాయి.

నాటుతుపాకీ, మందుగుండు పౌడర్ కలిగి ఉన్న వ్యక్తి అరెస్టు

అన్నవరం, ఆగస్టు9: శంఖవరం మండలం వేలంగి గ్రామంలో నాటుతుపాకీ, మందుగుండు సామగ్రి కలిగి ఉన్న వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసి అతని వద్ద నుంచి నాటుతుపాకీ, మందుగుండు పౌడర్, సీసపుగుళ్లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి చెప్పారు. అన్నవరం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె కేసు వివరాలను తెలిపారు. వేలంగికి చెందిన మొండి రాజు నాటుతుపాకీతో అదే గ్రామానికి చెందిన జగన్నాథం వెంకటశివకు చెందిన పెంపుడు కుక్కను కాల్చిచంపాడు. పోలీసులకు ఫిర్యాదుచేయగా ప్రత్తిపాడు సీఐ శేఖర్‌బాబు, అన్నవరం ఎస్ఐ వి.కిషోర్ నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నాటుతుపాకీ తన అన్నదని, అతను మరణించడంతో తన వద్ద ఉందని, వెంకటశివకు చెందిన పెంపుడుకుక్క తన కోళ్లను చంపి తింటోందని, అందుకే కాల్చానని రాజు తెలిపాడు. నాటుతుపాకీ కలిగి ఉండడం నేరం కావడంతో నిందితుడిని అరెస్టు చేశామని డీఎస్పీ చెప్పారు.

ఏటీఎం కార్డులు మార్చి దొంగతనాలు.. వ్యక్తి అరెస్టు

కొవ్వూరు, ఆగస్టు9: ఏటీఎం కార్డులను మార్చి నగదు దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. నిడదవోలులోని రాయపేటకు చెందిన నిచ్చెనకోళ్ల శివరామకృష్ణ ఏటీఎంల వద్దకు వచ్చే వృద్ధులు, డబ్బులు తీయడంరాని వాళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతుంటాడు. డబ్బు తీయడం రానివారు ఏటీఎం నుంచి డబ్బు తీయమని కార్డు ఇస్తే తప్పుడు పిన్ ఎంటర్ చేసి డబ్బు రావడం లేదని, అసలు కార్డుకు బదులుగా డూప్లికేట్ కార్డు ఇచ్చి అక్కడ నుంచి వెళ్లిపోతాడు. వేరొక ఏటీఎంల నుంచి డబ్బు విత్‌డ్రా చేసి జల్సా చేస్తుంటాడు. కొవ్వూరు మండలం పంగిడి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి రేలంగి నారాయణరావుకు చెందిన ఏటీఎం కార్డును ఇలాగే ఏమార్చి రూ.33,500 దొంగతనం చేశాడు. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శివరామకృష్ణపై రాజమహేంద్రవరం, విజయవాడ, కొవ్వూరులలో ఏడు కేసులున్నాయన్నారు. నిందితుడిని అరెస్టు చేసి మోటారుసైకిల్, దొంగతనానికి ఉపయోగించిన ఏటీఎం కార్డులను సీజ్ చేసినట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు. నగదు డ్రా చేయడానికి ఏటీఎంల వద్దకు వెళ్లినప్పుడు అపరిచితులకు పిన్ నెంబరు చెప్పవద్దన్నారు.

సెప్టెంబరు 14న జాతీయ లోక్‌అదాలత్ : పీడీజే

రాజమహేంద్రవరం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. శుక్రవారం ఆమె ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తులతో వర్చువల్ విధానంలో సమావేశమయ్యారు. సెప్టెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్, రాజీకి యోగ్యమైన క్రిమినల్, మోటారు వాహనాల ప్రమాదాలు, చెక్‌బౌన్స్, ప్రీ-లిటిగేషన్ కేసులు పెద్ద సంఖ్యలో పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అలాంటి కేసులను గుర్తించి ఆ జాబితా డీఎల్ఎస్ఏకి అందజేయాలన్నారు. ఇదే అంశంపై చిట్‌ఫండ్ సంస్థల ప్రతినిధులతోనూ చర్చించారు.

ఆదివాసీ రైతులకు వరం

చింతూరు డివిజనుకు 11 లిఫ్టు ఇరిగేషన్లు మంజూరు

రెండు వేల మంది రైతులకు లబ్ధి

చింతూరు, ఆగస్టు 9: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదివాసీ రైతులకు వరం ప్రకటించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజనులోని చింతూరు కూనవరం వరరామచంద్రపురం, ఎటపాక మండలాలకుగాను 11 లిఫ్టు ఇరిగేషన్లను సీఎం చంద్రబాబునాయుడు మంజూరుచేశారు. ఈ విషయాన్ని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో శుక్రవారం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధి దృష్టిలో పెట్టుకొని పలు పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈమేరకు చింతూరు ఐటీడీఏ పరిధిలో ఉన్న అవశ్యకతలను పొందుపర్చుతూ సీఎం కార్యాలయానికి చింతూరు ఐటీడీఏ నివేదిక పంపించడం జరిగిందని పీవో తెలిపారు. ఇందులో బాగంగా సీఎం చంద్రబాబునాయుడు చింతూరు ఐటీడీఏ పరిధిలోని రైతులకు రూ.2 కోట్ల నిధుల వ్యయంతో ఇరిగేషన్ ప్రాజెక్టులను మంజూరు చేశారన్నారు. దీంతో రెండు వేలమంది రైతులు లబ్ధి పొందే అవకాశం ఉందన్నారు. పోలవరం ముంపు పరిధి లేని గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. దీనివల్ల ఇప్పటివరకు ఏడాదిలో ఒకే పంటకు అవకాశం ఉన్న పొలాల్లో ఇకపై ఏడాదికి రెండు పంటలు సాగు చేసుకునే అవకాశం కల్గింది.



అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులో కొండరెడ్ల కుటుంబాలకు కేటాయించిన స్టాండ్ సోలార్ సెట్‌ని ఆవిష్కరిస్తున్న ఏపీఈపీడీసీఎల్ రాజమండ్రి ఎస్ఈ కె.తిలక్‌కుమార్

ఇకపై కొండల్లోనూ విద్యుత్ కాంతులు

స్టాండ్ సోలార్ సెట్ల పంపిణీ.. దేశంలోనే తొలి పైలెట్ ప్రాజెక్టుగా చింతూరు డివిజన్

చింతూరు, ఆగస్టు 9: ఎక్కడో కొండలపై జీవనం సాగిస్తున్న కొండరెడ్ల ఆవాసాలు నేటికీ చీకటిలో మగ్గుతున్న విషయం తెలిసిందే. అంతటి ఎత్తైన ప్రదేశాలకు విద్యుత్ సరఫరా లైన్లను ఏర్పాటు చేయలేకపోవడమే దీనికి కారణం. అయితే ఇకపై ఆ ఆవాసాలు కూడా విద్యుత్ కాంతులతో కళకళలాడనున్నాయి. ప్రధానమంత్రి జన్‌మన్ యోజన పథకంలో భాగంగా కొండరెడ్ల ఆవాసాలకు స్టాండ్ సోలార్ సెట్ల ద్వారా విద్యుత్ వెలుగులు కల్పించనున్నారు. దేశంలోనే మొట్టమొదటిగా మన రాష్ట్రం ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంది. ఇందులో బాగంగా ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్‌లోని చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఏపీఈపీడీసీఎల్ రాజమండ్రి ఎస్ఈ తిలక్‌కుమార్‌లు 94 కొండరెడ్ల కుటుంబాలకు స్టాండ్ సోలార్ సెట్లను ఉచితంగా అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలిరోజు నలుగురు లబ్ధిదారులకు అందించగా, మిగిలినవి కొద్దిరోజుల్లోనే అందజేస్తామని ఎస్ఈ చెప్పారు. తర్వాత ఇదే తరహాలో రాష్ట్రంలోని విద్యుత్ సరఫరాలేని ప్రతి కొండరెడ్డి ఆవాసానికి ఈ పథకం వర్తించనుంది. పూర్తి సబ్సిడీతో ఒక్కో కుటుంబానికి రూ.50 వేల విలువగల సోలార్ సెట్‌ను అమర్చనున్నారు. ఈ సిస్టం ద్వారా ఐదు బల్బులు, ఒక ఫ్యాన్, ఒక లాప్‌ట్యాప్, ఒక మొబైల్‌కు సరఫరా అందనుంది. ఈ కార్యక్రమంలో ఏడీఈ మలాకి, లైన్ ఇన్‌స్పెక్టర్ కె.గణేష్ పాల్గొన్నారు.



ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో గిరిజన తెగల పెద్దలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శిరీష

గిరిజన తెగల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరంలో ఘనంగా ఆదివాసీ దినోత్సవం

గిరిజన పెద్దలకు సత్కారం

రంపచోడవరం, ఆగస్టు9: ఏజెన్సీలోని అన్ని గిరిజన తెగలతో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగిందని శాసన సభ్యురాలు మిరియాల శిరీషదేవి అన్నారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్ ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏడు తెగలకు చెందిన గిరిజన పెద్దలను సన్మానించారు. ఎమ్మెల్యే శిరీషదేవి మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన తెగలు గిరిజనాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపడుతామన్నారు. జీవో నెం.3ని పునరుద్ధరించే విధంగా తన వంతు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఐటీడీఏ పీవో మాట్లాడుతూ గిరిజనుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి అన్ని గిరిజన తెగలతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సబ్‌కలెక్టరు ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన తెగల సమన్వయంతో ఐటీడీఏ ద్వారా గిరిజనా ప్రాంత అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరగడంపై గిరిజనులకు కృతజ్ఞతలు తెలిపారు. 1/70 చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఏజెన్సీలో సకాలంలో వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కాగా ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏడీఎంహెచ్‌వో కార్యాలయంలో బ్లడ్ డోనేషన్ క్యాంపు నిర్వహించారు. ఏడు తెగలకు సంబంధించిన సంస్కృతిక సంప్రదాయాల స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబురమేష్, ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, సర్పంచ్ మంగా బొజ్జయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

డిసెంబరు 14 నుంచి కాకినాడలో

యూటీఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలు

నేడు ది గోదావరి యూటీఎఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్ పథకం ప్రారంభోత్సవం : ఏపీ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి

దివాన్‌చెరువు, ఆగస్టు9: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర స్థాయి స్వర్ణోత్సవ మహాసభలు డిసెంబరు 14వ తేదీ నుంచి 17 వరకూ కాకినాడలో జరుగుతాయని ఏపీ యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి ఎస్.అరుణకుమారి తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'తో శుక్రవారం ఆమె మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు జరిగే ఈ మహాసభలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా యూటీఎఫ్ ఆతిథ్యమిస్తోందన్నారు. విద్యారంగంలో సమస్యలు, రావాల్సిన మార్పులు, ప్రత్యామ్నాయ విద్యావిధానాలు, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం వంటి అంశాలపై చర్చిస్తామని చెప్పారు. ఈ మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25 వేల మంది ప్రతినిధులు హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. ఈ సదస్సులు విజయవంతం చేసే కార్యాచరణలో భాగంగా రెండు మూడు జిల్లాలకు కలిపి సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవం సందర్భంగా మండల, జిల్లాస్థాయిల్లో ఉపాధ్యాయులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. కాగా యూటీఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం రాజమహేంద్రవరంలో జరిగే కార్యక్రమంలో ది గోదావరి యూటీఎఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్ పథకం ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు. దీనికి యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. అలాగే అమలాపురంలోని శ్రీసత్యసాయి కళ్యాణ మండపంలో జరిగే రాష్ట్ర విద్యాసదస్సుకు ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, పీడీఎఫ్ ఫ్లోర్ లీడర్ కేఎస్ లక్ష్మణరావు తదితర్లు హాజరవుతారని అరుణకుమారి తెలిపారు.



ఆర్టీసీ బస్సు ఢీకొని మృతిచెందిన నాగయ్య

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

కరప, ఆగస్టు9: ద్రాక్షారామ-యానాం రహదారిలో గొప్పరేవు వద్ద శుక్రవారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఒక యువకుడు మృతి చెందాడు. స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం రాజానగరం మండలం ముక్కినాడకు చెందిన పలువురు యువకులు యానాం వెళ్లి మోటర్‌సైకిళ్లపై తిరుగు ప్రయాణమయ్యారు. కోలంక శివారు గొప్పరేవు వంతెనల మలుపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న రామచంద్రపురం-యానాం ఆర్టీసీ బస్సును యువకులు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మేకల నాగయ్య(18) అనే యువకుడు మృత్యువాత పడగా అతని మిత్రులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. యువకులు అతిగా మద్యం సేవించినట్టు స్థానికులు చెబుతున్నారు. ఘటనాస్థలిని ఎస్ఐ తులసీరామ్, ఏఎస్ఐ డేవిడ్, రెవెన్యూ అధికారి సుబ్రహ్మణ్యం పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లపాలెం పోలీసులు కేసు నమోదుచేశారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్‌జేసీ సుబ్బారావు

భీమేశ్వరాలయ ఈవోపై ఆర్‌జేసీ విచారణ

ద్రాక్షారామ, ఆగస్టు 9: ద్రాక్షారామ భీమేశ్వరాలయం ఈవో పీటీవీ సత్యనారాయణపై వచ్చిన అవినీతి ఆరోపణలపై శుక్రవారం దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ కె.సుబ్బారావు విచారణ ప్రారంభించారు. మంత్రి సుభాష్ ఆలయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలని కోరడంతో దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆర్‌జేసీ విచారణ నిర్వహించారు. పైండావారి సత్రంలో ఆలయ ఈవో పీటీవీ సత్యనారాయణపై ఆరోపణలు, ఫిర్యాదులు చేసిన వ్యక్తుల నుంచి ఆర్‌జేసీ ఫిర్యాదులు స్వీకరించారు. రథం నిర్మాణంలో అవకతవకలు, దాతలు పలు కార్యక్రమాలు నిర్వహించగా వాటికి దేవస్థానంలో ఖర్చు నమోదు చేసినట్లు తదితర ఆరోపణలపై ఫిర్యాదులు స్వీకరించినట్టు ఆర్‌జేసీ తెలిపారు. దేవస్థానంలో గత ఐదేళ్లలో జరిగిన అంశాలపై ఆరుగురు అధికారులతో కూడిన కమిటీ రికార్డులు పరిశీలన జరుపుతోందని, విచారణ పూర్తయ్యాక కమిషనరుకు నివేదిక అందజేస్తామని ఆర్‌జేసీ సుబ్బారావు తెలిపారు..



అమరావతిలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసిన జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

బ్లూ ఎకానమీ ప్రాజెక్టుపై చర్చించిన పవన్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు9: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణం, అడవులు, సైన్స్‌అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు, సీనియర్ పర్యావరణ శాస్త్రవేత్తలు అవనీష్‌కాంత్, సిద్ధార్థలతో సమీక్షించారు. రాష్ట్రంలో సముద్ర వనరుల సమర్థవినియోగం, బ్లూఎకానమీ ప్రాజెక్టు అమలు అంశాలపై చర్చించారు. ఇప్పటికే కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఈ ప్రాజెక్టు అమలుకు వరల్డ్ బ్యాంకు అందిస్తున్న ఆర్థిక, సాంకేతిక సహాయాలను బ్యాంకు ప్రతినిధులు ఉపముఖ్యమంత్రికి వివరించారు. అదే తరహాలో ఈ ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలుచేసేందుకు వరల్డ్ బ్యాంకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ సమావేశంలో నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ సంస్థ డైరక్టర్ రమణమూర్తి, శాస్త్రవేత్త సత్యకిరణ్ రాజు, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఆకస్మికంగా ప్లజర్ వాహనం దగ్ధం

మలికిపురం, ఆగస్టు9: మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో ప్లజర్ వాహనం దగ్ధమైంది. రామరాజులంకకు చెందిన ఓ యువకుడు శుక్రవారం పెట్రోల్ నింపుకుని బయటికి వస్తుండగా కింది భాగం నుంచి మంటలు వ్యాపించడంతో బండిని వదిలి పరుగులు తీశాడు. సమీపంలోని ఒక మెకానిక్ పెట్రోల్ బంకులోని మంటలు ఆర్పే పరికరంతో ప్రయత్నం చేసినప్పటికీ మంటలు ఆగలేదు. ఈ సంఘటనలో వాహనం మొత్తం దగ్ధమైంది. తర్వాత పోలీసులు వచ్చి ఆరా తీశారు.



వ్యవసాయశాఖ మంత్రికి వినతిపత్రం ఇస్తున్న పురందేశ్వరి తదితరులు

రాష్ట్రంలో జాతీయ మామిడి బోర్డు ఏర్పాటు చేయాలి : పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు9: జాతీయ మామిడిబోర్డును ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేయాలని, తోతాపురి మామిడిని కనీస మద్దతు ధరల జాబితాలో చేర్చి టన్నుకు రూ.25 వేలు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. చిత్తూరు ఎంపీ ప్రసాదరావు, ఆ జిల్లా బీజేపీ అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి తదితరులతో కలిసి శుక్రవారం ఢిల్లీలోని పార్లమెంట్‌లో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిశారు. పల్ప్ ఫ్యాక్టరీలు సిండికేట్‌గా చేరి రైతులను దోచుకుంటున్నాయన్నారు. జాతీయ మామిడి బోర్డు ఏర్పాటు చేయడం ద్వారా దీన్ని అడ్డుకోవచ్చని వివరించారు. దీనిపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి సానుకూలంగా స్పందించారని, ప్రధానితో చర్చించి మామిడి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని పురందేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆరోపణలు రుజువు చేస్తే మంత్రి, ఎమ్మెల్యే

పదవికి రాజీనామా చేస్తా

కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

అంబాజీపేట,ఆగస్టు9: హైదరాబాద్‌లో గంజాయి కేసులో పట్టుబడిన వ్యక్తులు తన అనుచరులని జగన్ సొంత ఛానెల్‌లో ప్రచారం చేయడంపై మంత్రి సుభాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ఛానెల్‌లో చేసిన ఆరోపణలు రుజువుచేస్తే తన మంత్రి పదవికి, శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని మంత్రి సుభాష్ సవాలు విసిరారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. గంజాయిని అరికట్టేందుకు అమ్ముతున్న వారి సమాచారం తెలిపితే చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచి తన సొంత డబ్బులు రూ.5 వేల రివార్డును ప్రకటించానని తెలిపారు. దీనికి జగన్ సొంత ఛానెల్ వక్రీకరించడం తగదన్నారు. గంజాయిని పెంచిపోషించిన వైసీపీ ప్రభుత్వం యువత భవిష్యత్‌తో ఆడుకున్నదన్నారు. గంజాయిని అరికట్టేందుకు ఎన్డీఏ ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కార్మిక శాఖను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. కార్మికశాఖలో 3 వేలు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన రూ.3 వేల కోట్లను జగన్ ప్రభుత్వం దోచుకుందన్నారు. కార్మికుల ఆరోగ్యం మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.450 కోట్లు కేటాయిస్తుందని, వీటిని కార్మికుల కోసం ఖర్చుచేయకుండా వారి ఆరోగ్యంతో ఆటలాడుకుందన్నారు. అలాగే బాలకార్మికులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి పాల్గొన్నారు.

చెల్లని వర్గీకరణ జిల్లాల వారీగా ఎలా చేస్తారు : మాజీ ఎంపీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 9: భారత రాజ్యాంగంలో 341 ఆర్టికల్ సవరణ లేకుండా వర్గీకరణ చెల్లదు. అటువంటిది రాష్ట్రంలో జిల్లాల వారీగా ఎలా చేస్తారని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్, మాజీ ఎంపీ హర్షకుమార్ ప్రశ్నించారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యా సంస్థలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రిజర్వేషన్లు క్రిమీలేయర్ ఎత్తివేసేలా సుప్రీంకోర్టు తీర్పు ఉందన్నారు. క్రిమీ లేయర్‌ను కేంద్రం గుప్పెట్లో పెట్టుకుని ఒక్క వర్గీకరణ అధికారాన్ని మాత్రం రాష్ట్రాలకు చుట్టబెడుతుందన్నారు. రాజ్యాంగ సవరణ లేకుండా వర్గీకరణ చెల్లదన్నారు. జిల్లాల వారీగా జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం అవివేకమన్నారు. విజయవాడ బసవపున్నయ్య ఆడిటోరియంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సమావేశం శనివారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నామని, అందులో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఏజెన్సీ సమాచారం



చింతూరులో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాల్లో పాల్గొన్న ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, ఏఎస్పీ రాహుల్‌మీనా, డీఎఫ్‌వో భవిత

గిరిజనాభివృద్ధే లక్ష్యం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

చింతూరు, ఆగస్టు9: గిరిజనాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం చింతూరు ఐటీడీఏని ముందుకు నడిపిస్తోందని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. శుక్రవారం చింతూరులో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సంబరాలను ఐటీడీఏ ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ర్యాలీతోపాటు చింతూరు సెంటరులో ఉన్న మన్యంవీరుల విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం పీవో కావూరి చైతన్య మాట్లాడుతూ అటవీ హక్కులచట్టం ద్వారా 4348 ఆదివాసీ కుటుంబాలకు 16,714 ఎకరాలకు హక్కు పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. పోలవరం నిర్వాసితులకోసం రూ.88 కోట్ల వ్యయంతో 833 కాలనీల నిర్మాణం జరుగుతోందని, వీటిలో ఇప్పటికే 747 కాలనీలు పూర్తి అయ్యాయన్నారు. ఆదివాసీ కుటుంబాలు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులను ప్రాసింగ్ చేసి మార్కెట్ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. ఆదివాసీ రైతులు దళారుల బారినపడకుండా స్వయం సహాయక సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో నేరుగా నగదు వేయడం జరుగుతుందన్నారు. చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా, డీఎఫ్‌వో భవిత ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీ పెద్దలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. చదువుల్లో రాణిస్తున్న విద్యార్థులతోపాటు పెద్దలను సన్మానించడం జరిగింది.



అడ్డతీగలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

ఏజెన్సీ అంతటా ఆదివాసీ సంబరాలు

అడ్డతీగల, ఆగస్టు 9: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని అల్లూరి జిల్లా అడ్డతీగల మండలంలో ఆదివాసీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అడ్డతీగల గిరిజన సంప్రదాయ నృత్యాలతో ప్రధాన రహదారిలో భారీ ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యలో అంబేడ్కర్, అల్లూరి తదితర నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేశారు. స్థానిక దేవి సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. తదుపరి ఆదివాసీభవన్ ఆవరణలో సమావేశం నిర్వహించి ఆదివాసీ అభ్యుదయంపై వక్తలు ప్రసంగించారు. తదుపరి మహా అన్న సమారాధన నిర్వహించారు.

వరరామచంద్రాపురంలో..

వరరామచంద్రాపురం, ఆగస్టు 9: మండలంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా రేఖపల్లిలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సయ్యద్ మౌలానాఫాజిల్ కేక్‌కట్ చేసి వేడుకలు జరిపారు. ఆదివాసీ జేఏసీ నాయకులు వాళ్ళ రంగారెడ్డి, ఎంపీపీ కారం లక్ష్మి సమక్షంలో రేఖపల్లి కస్తూరిబా పాఠశాల వద్ద, వీఆర్‌పురంలోను ఆదివాసీ జెండాను ఎగురవేశారు. అనంతరం రేఖపల్లి నుంచి వీఆర్ పురం మీదుగా మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూనెం ప్రదీప్, గిరిజన సంఘం నాయకులు కారం సుందరయ్య, సర్పంచ్ పూనెం సరోజిని, మచ్చ భీమయ్య, పాయం లక్ష్మణరావు, బురక కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వై రామవరంలో..

వై.రామవరం, ఆగస్టు 9: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వై.రామవరం జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రామంలో ర్యాలీ జరిపి జడ్పీ స్కూల్‌లో ఆదివాసీ జెండాను ఎగురవేశారు. సర్పంచ్ పల్లాల బాలురెడ్డి, ఎంపీడీవో కె.బాపన్నదొర, తహశీల్దార్ నాగరాజు, ఎస్ఐ సంతోష్‌కుమార్, రిటైర్డ్ వెటర్నరీ ఉద్యోగి గొర్లె శివరామ్‌కుమార్, ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. విద్యార్థినులు డ్యాన్సులతో అలరించారు. మాజీ ఎంపీపీ గొర్లె శ్రీకాంత్, ఆదివాసీ నేతలు పల్లాల వెంకటరమణ, పల్లాల లింగారెడ్డి, పుడిగి లక్ష్మణరావు, ముర్ల సూరిబాబు, ఉపాధ్యాయులు లండా రాజబాబు, లక్ష్మణరెడ్డి, డీటీ సుధాకరరావు, ఎంఈవో తాతాబ్బాయిదొర, ఆర్ఐ కాతారెడ్డి పాల్గొన్నారు. కాగా స్థానిక ఆశ్రమ పాఠశాలలో ఐదవ తరగతి గిరిజన విద్యార్థిని ముర్ల శ్రీవల్లి తన డ్యాన్స్‌తో అందరినీ సైతం ఫిదా చేసింది. దీంతో అధికారులు, నాయకులు ముగ్ధులై రూ.1600 వరకు ఆ చిన్నారికి అందించారు.

రాజవొమ్మంగిలో..

రాజవొమ్మంగి ఆగస్టు 9: రాజవొమ్మంగి మండలంలో శుక్రవారం పండగ వాతవరణంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జరిగింది. రాజవొమ్మంగి ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో తొలుత నాయకులు ఆదివాసీ జెండా ఎగురవేసి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, రాజవొమ్మంగి గ్రామంలో భారీ ర్యాలీ చేపట్టారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో వివిధ వక్తలు మాట్లాడుతూ గిరిజన హక్కులను కాపాడాలన్నారు. ఆదివాసీ నాయకులు వంతు బాలకృష్ణ, తాము సూరిబాబు, వజ్రపు అప్పారావు, బొడరపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎటపాకలో..

ఎటపాక, ఆగస్టు 9: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. చెన్నంపేటలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జెండాను ఆవిష్కరించారు. దమ్మక్కగూడెం గ్రామంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నేత సున్నం వెంకటరమణ ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. మండల కేంద్రమైన ఎటపాకలో ఎంపీడీవో మురళీకృష్ణ, ఎంపీపీ కాక కామేశ్వరి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

మోతుగూడెంలో..

మోతుగూడెం, ఆగస్టు9: చింతూరు మండలం మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో దబ్బగూడెం గ్రామం వద్ద మోతుగూడెం ఎస్ఐ జి. గోపాలరావు ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సంబరాలు నిర్వహించారు.

మాతృ ప్రదేశాలకు తహశీల్దార్లు

చింతూరు, ఆగస్టు9: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ పరిధిలోని తహశీల్దార్లను రిలీవ్ చేస్తూ శుక్రవారం కలెక్టర్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. చింతూరు డివిజన్‌లోని చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాలకు ఫిబ్రవరి 5న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివిధ జిల్లాల నుంచి తహశీల్దార్లు వచ్చారు. ఎన్నికలు ముగిసిన వెంటనే తిరిగి మాతృ ప్రదేశాలకు వెళ్లాల్సి ఉన్నా విలీన మండలాల్లో వరుసగా వరదలు వస్తున్నందున వరద సహాయక చర్యల్లో వీరంతా విధులు నిర్వహించాల్సి వచ్చింది. దీంతో ప్రభుత్వం వీరిని ఇప్పటి వరకు కొనసాగిస్తూ వచ్చింది. వరదలు కూడా తగ్గుముఖం పట్టడంతో తహశీల్దార్లను రిలీవ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. వీరిలో చింతూరు తహశీల్దార్ ఎండి నజీముల్లాసా (పశ్చిమగోదావరి) కూనవరం ఆర్‌వీ మురళీకృష్ణ (పశ్చిమగోదావరి) వరరామచంద్రపురం సయ్యద్ మౌలానా ఫాజిల్ (పశ్చిమగోదావరి) ఎటపాక మండల తహశీల్దార్ డి శేఖర్‌లు(విశాఖపట్నం) ఉన్నారు. కాగా చింతూరు డివిజన్‌కు కొత్తవారు వచ్చే వరకు డీటీలు ఇన్చార్జులుగా ఉంటారు.

రహదారి ప్రమాదాలు నివారించండి

» రహదారి భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రహదారి ప్రమాదాల నివారణకు పటిష్టమైన కార్యాచరణ రూపొందించడంతో పాటు భద్రత ప్రమాణాలను సమర్థవంతంగా అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో భాగంగా వాటిపై సమగ్ర అధ్యయనానికి వివిధ శాఖలతో కలిపి రూపొందించిన సమీకృత రహదారి ప్రమాద డేటాబేస్‌లో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలన్నారు. జాతీయ రహదారులపై ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడానికి ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్మార్టు సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి వాహనాల వేగ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల సంఖ్య, వాటి పనితీరుపై ఆరా తీశారు. ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా వర్టికల్ పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలన్నారు. రోడ్లపై వాహనాలను నిలపకుండా ఆర్టీఏ అధికారులు చూడాలన్నారు. జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి బ్లాక్ స్పాట్‌లను గుర్తించామని ఎస్పీ డి.నరసింహ కిశోర్ పేర్కొన్నారు. ఆయా ప్రదేశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత శాఖల అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. జాతీయ రహదారులపై హైవే పెట్రోలింగ్ వాహనాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేశామన్నారు. హిట్ అండ్ రన్‌కి సంబంధించి గాయపడిన వాళ్లకు రూ.50వేలు, మరణిస్తే రూ.2లక్షలు కేంద్ర ప్రభుత్వం పరిహారం అందజేస్తోందని తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి జేసీ జి.నరసింహులు, డీటీవో కెఎస్ఎంవీ.కృష్ణారావు, ఎంవీఐలు సంపత్ కుమార్, రంగనాయకులు, రామనారాయణ, నాయక్, ఏఎంవీఐలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

దత్తత ప్రక్రియలో మార్గదర్శకాలు పాటించాలి

» ఇద్దరు ఏఎన్‌ఎంల తొలగింపునకు కలెక్టర్ ఆదేశాలు

» చైల్డ్‌కేర్ హోమ్‌కు తూర్పుగోనగూడెం చిన్నారి

రాజానగరం, ఆగస్టు 9: పిల్లలను దత్తత వ్యవహారాల్లో ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. మండలంలోని తూర్పుగోనగూడెంలో ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించి ఆడ శిశువును వేరొకరికి అప్పగించిన వ్యవహారంలో ప్రత్యక్ష భాగస్వాములైన ఏఎన్‌ఎంలు చిక్కాల అనురాధ, పేకల గంగమ్మలపై కేసు నమోదు చేయడమే కాకుండా ఇద్దరినీ విధుల నుంచి తొలగించాలంటూ శాఖాపరమైన చర్యలకు కలెక్టర్ ఆదేశించారు. తూర్పుగోనగూడేనికి చెందిన కొర్రపు ఆదిలక్ష్మి తన కుమార్తెను తిరిగి అప్పగించాలని కోరుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామంలో విచారణ చేపట్టిన విషయం తెల్సిందే. గ్రామానికి చెందిన కొర్రపు ఆదిలక్ష్మి, అప్పారావు దంపతులు చట్ట వ్యతిరేకంగా తమ పిల్లను వేరొకరికి అప్పగించారన్నారు. ఈ ఘటనలోని వాస్తవాలపై విచారణ చేపట్టాల్సిందిగా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ విజయకుమారిని ఆదేశించారు. ఈ ఘటనలో ప్రత్యక్ష భాగస్వాములైన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఏఎన్‌ఎంలు చిక్కాల అనురాధ, పేకల గంగమ్మలపై రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయడంతో పాటు విధుల నుంచి తొగించేలా శాఖాపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించామన్నారు. చట్ట వ్యతిరేకంగా చిన్నారిని పెంచుకుంటున్న వారి నుంచి శుక్రవారం పాపను చైల్డ్‌కేర్ హోమ్‌కు తరలించే చర్యలు చేపట్టారు. ఇటువంటి కార్యకలాపాల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, వ్యక్తులపై పోలీసు కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. పిల్లలను దత్తత తీసుకునేటప్పుడు తప్పనిసరిగా చట్టపరిధిలో, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు చేపట్టాలన్నారు. ఇటువంటి ఘటనల్లో భాగస్వామ్యమయ్యే వారిపై కూడా ఎఫ్ఐఆర్ నమోదుచేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ మేరకు ఇద్దరు ఉద్యోగులపై సెక్షన్ 363,365 రీడ్ విత్ 34 ఐపీసీ3(2)(విఏ)ఎస్సీ, ఎస్టీ పీవోఏ యాక్ట్ ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదైనట్టు కలెక్టర్ తెలిపారు. పెంచుకున్న వారి నుంచి పాపను తీసుకొచ్చారని, రాజమహేంద్రవరం చైల్డ్ కేర్ హోమ్‌కు తరలించి సంరక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా చైల్డ్‌ప్రొటెక్షన్ అధికారి రాజ్‌కుమార్ ఆదేశించారు.

మహిళా సాధికారత కూటమితోనే సాధ్యం

» స్వయం శక్తి సంఘాలను చిత్తశుద్ధితో అభివృద్ధి చేయాలి

» ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



రామవరంలో సమీక్షా సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఆగస్టు 9: మహిళా సాధికారత కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, స్వయం శక్తి సంఘాల అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం రామవరంలోని పంచాయతీ కార్యాలయంలో నియోజకవర్గ వెలుగు అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన ప్రసంగించారు. డ్వాక్రా రుణాల మంజూరులో బ్యాంకులు ఇబ్బందులు పెడితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో అనేక అవకతవకలు జరిగినట్టు తమ దృష్టికి వచ్చిందని దీనిపై సమగ్ర విచారణ నిర్వహించి చర్యలు చేపడతామన్నారు. డ్వాక్రా మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రుణాలు, అభయహస్తం పించన్లపై అవగాహన కల్పించే విధంగా సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. ఈ సందర్భంగా నాలుగు మండలాల ఏపీఎంలు, సీసీలు తమ మండలాల్లోని పరిస్థితులను ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, పడాల వెంకటరామారెడ్డి, రావాడ నాగు, కర్రి శేషారత్నం, జుత్తుగ సూర్యకుమారి, మల్లేశ్వరి, కర్రి సత్యగౌరి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందన సభ.. అధికారంలోకి వచ్చిన 45రోజుల్లోనే శ్మశాన వాటిక స్నానఘట్టం, భవన నిర్మాణాలు పూర్తి చేసిన సందర్భంగా స్థానిక ఎస్సీపేటలో ఎమ్మెల్యే నల్లమిల్లిని, వార్డు సభ్యుడు చింతా సురేష్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు లంక పెద సత్యనారాయణ, అంగర గంగరాజు, లంక సత్తియ్య తమ అనుచరులతో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరిడా గంగాభవాని, తేనెల శ్రీనివాస్, చింతా సురేష్‌రెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వర్తక సంఘం కార్యాలయం ప్రారంభం.. అనపర్తిలోని వర్తక సంఘం కళ్యాణ మండపంలో నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రారంభించారు. వర్తక సంఘం కార్యవర్గ సమావేశాల నిర్వహణకు అధ్యక్షుడు కొవ్వూరి వెంకటరామారెడ్డి ఆధ్వర్యంలో కార్యాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. వర్తకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నల్లమిల్లి ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో వర్తక సంఘం ప్రతినిధులు సత్తి వెంకటరామారెడ్డి, వెత్సా శేషుబాబు, సత్తి విశ్వనాథరెడ్డి, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

'హర్ ఘర్ తిరంగా'ను జయప్రదం చేయండి



రంగంపేట, ఆగస్టు 9: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో పి.వెంకటరత్నం సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలోనూ ప్రజలు వారి ఇంటి మీద జాతీయజెండా ఎగుర వేసి జాతీయజెండాతో సెల్ఫీ తీసుకోవాలన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి అందరితో ఎంపీడీవో తిరంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోకవరం: గోకవరంలో ప్రధాన రహదారిపై ఎంపీడీవో గోవిందు, పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాసరావు, రాజా కాన్వెంట్ విద్యార్థులు తదితరులు కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఎంపీడీవో అన్నారు.

కడియం: కడియం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఎంసీ అధ్యక్షురాలు గారపాటి సత్య, ఉపసర్పంచ్ వెలుగుబంటి రఘురామ్ (నాని) పతాకావిష్కరణ చేశారు. వారం రోజులు ప్రతిఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని చెప్పారు. ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ, ఎస్‌ఎంసీ సభ్యురాలు తదితరులు పాల్గొన్నారు.

వడిశలేరులో తాటాకిల్లు దగ్ధం

రంగంపేట, ఆగస్టు 9: మండలంలోని వడిశలేరు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో కొల్లం చిన వెంకటేశులకు చెందిన తాటాకిల్లు దగ్ధమైందని రూ.30 వేల ఆస్తినష్టం జరిగిందని వీఆర్వో పద్దయ్య తెలిపారు. వంట చేస్తుండగా మంట ఇంటి తాటాకులకు అంటు కొని ఈ ప్రమాదం జరిగిందన్నారు. తహశీల్దార్ తలీఫ్‌పాషా ఆదేశాల మేరకు స్థానిక కూటమి నాయకుల ద్వారా బియ్యం అందించామన్నారు.

సీతానగరంలో గర్భిణులకు కిట్లు పంపిణీ

సీతానగరం, ఆగస్టు 9: గర్భిణులకు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పౌష్టికాహారం కిట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సీతానగరం పీహెచ్‌సీ వద్ద డాక్టర్ ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో డాక్టర్ ఈ.ఏసురాణి 30 మంది గర్భిణులను పరీక్షించి తల్లి, గర్భస్థ శిశువు ఆరోగ్య స్థితిని తెలియజేశారు. వారందరికీ బీపీ, రక్తపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వై.సుబ్బారాయుడు, సీహెచ్‌వో వెంకటరత్నం, సత్యసాయి సేవాసంస్థ ప్రతినిధులు కెజఆదిలక్ష్మి, దైవకృప, శిల్ప, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తగ్గిన గోదావరి ఉధృతి

ధవళేశ్వరం, ఆగస్టు 9: విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల వాగులు వంకల నుంచి ప్రవాహం గోదావరిలో కలుస్తూ ఉండడంతో కొద్దిరోజులుగా పెరుగుతూ తగ్గుతూ ప్రవహిస్తున్న గోదావరి ప్రస్తుతం ఎగువన భద్రాచలం వద్ద దిగువన ధవళేశ్వరం వద్ద ఉధృతి తగ్గి ప్రవహిస్తోంది. శుక్రవారం సాయంత్రం కాటన్ బ్యారేజ్ నుంచి 6,81,702క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుండగా నీటిమట్టం 9.40అడుగులుగా నమోదయింది. సాగునీటి అవసరాల కోసం తూర్పుడెల్టాకు 2వేల క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1500 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 2వేల క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద తగ్గుతున్న నీటి మట్టం శుక్రవారం సాయంత్రానికి 33 అడుగులకు చేరుకుంది.

భక్తులతో పోటెత్తిన లక్ష్మీనారాయణుడి ఆలయం

బిక్కవోలు, ఆగస్టు 9: శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా గ్రామ క్షేత్ర పాలకులైన లక్ష్మీనారాయణస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఆలయార్చకులు స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు జరిపి ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఈఓ ఆకెళ్ల భాస్కర్ భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసారు.

బిక్కవోలు తహశీల్దార్‌గా రమణి

బిక్కవోలు, ఆగస్టు 9: బిక్కవోలు తహశీల్దార్‌గా డబ్ల్యుఎల్. రమణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీటీ కృష్ణ, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ఈమె కృష్ణా జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన కన్యాకుమారి విజిలెన్స్ తహశీల్దార్‌గా బదిలీ అయ్యారు.

గోకవరం తహశీల్దార్‌గా సరస్వతి

గోకవరం, ఆగస్టు 9: గోకవరం తహశీల్దార్‌గా వై.సరస్వతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కృష్ణా జిల్లా నందిగామ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆమె అనపర్తి తహశీల్దార్‌గా పనిచేశారు. ఇప్పటివరకు కార్యాలయ డిప్యూటీ తహశీల్దార్ రజని ఇన్‌చార్జి తహశీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించారు.

కడియం తహశీల్దార్‌గా పోసిబాబు

కడియం, ఆగస్టు 9: కడియం తహశీల్దార్‌గా కె.పోసిబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కృష్ణా జిల్లా నిడమారు మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దారు కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు పోసిబాబుకు పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈయన గతంలో రాజమహేంద్రవరం రూరల్, బిక్కవోలు, రాజమహేంద్రవరం అర్బన్, కోరుకొండ, గోకవరం తహశీల్దార్‌గా పనిచేశారు.

రాజమహేంద్రవరం రూరల్ తహశీల్దార్‌గా రమ్య

రాజమహేంద్రవరం రూరల్,ఆగస్టు 9: రాజమహేంద్రవరం రూరల్ మండల తహశీల్దార్ (ఎఫ్ఏసీ)గా జెఎల్ రమ్యను నియమిస్తూ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు. రమ్య ప్రస్తుతం మండల డిప్యూటీ తహశీల్దార్‌గా వున్నారు. ఇప్పటివరకు ఇక్కడ తహశీల్దార్‌గా వున్న అప్పారావు పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీపై వెళ్లారు.

హ్యాండ్లూమ్ వస్త్ర ప్రదర్శన షురూ.!



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 9: దేశీ కళా అతెంటిక్ లూమ్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని ఆల్ బ్యాంక్ కాలనీ, జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డులోని జేకే గార్డెన్స్‌లో సిల్క్ ఇండియా హ్యాండ్లూమ్ వస్త్ర ప్రదర్శన ఈ నెల 9 నుంచి 13వరకు జరుగుతుందని ఆర్గనైజర్ సతీష్‌కుమార్ తెలిపారు. సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్ ప్రత్యేకత తెలుపుతూ చేనేత కళాకారులు ఎంతో శ్రమతో, నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ఇండియా మొత్తంలోని 18 రాష్ట్రాల నుంచి రూపొందించిన చేనేత ఉత్పత్తులను ప్రజలు కొనుగోలు చేసి ప్రోత్సహించాలని కోరారు. చేనేత ఉత్పత్తులు బనారస్, బాగాల్పూరి, బెంగుళూరు సిల్క్, మైసూరు సిల్క్, పోచంపల్లి, లెనిన్ కాటన్, జందని, తస్సర్ వంటివి సుమారు 50కి పైగా స్టాళ్లను ప్రదర్శిస్తున్నామని సతీష్‌కుమార్ చెప్పారు.

ఉచితంగా సెల్ ఫొటోగ్రఫీ కోర్సు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 9: రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్రంలోనే తొలిసారిగా సెల్‌ఫోన్ ఫొటోగ్రఫీపై సర్టిఫికెట్ కోర్సు ప్రవేశపెడుతున్నామని కళాశాల ప్రిన్సిపాల్ ఎబెల్ రాజబాబు తెలిపారు. ఈ మేరకు కళాశాల తెలుగుశాఖాధిపతి పీవీబీ సంజీవరావు ఆధ్వర్యంలో జగతి మీడియా క్రియేషన్స్ సీఈవో శింగన నారాయణమూర్తి, డైరెక్టర్ కోమటి నాగేశ్వరరావులతో ఒప్పందం కుదిరిందని తెలిపారు. కోర్సు కోఆర్డినేటర్ సంజీవరావు మాట్లాడుతూ 50 రోజుల పాటు కోర్సు ఉచితంగా నేర్పిస్తామన్నారు. ఏ కళాశాల విద్యార్థియైనా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.

సబ్సిడీపై బిందు, తుంపర సేద్యం యూనిట్లు

ఏపీఎంఐపీ ప్రాజెక్ట డైరెక్టర్ అడపా దుర్గేష్



రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 9: భూగర్భ జలాలు అడుగంటిన నేపథ్యంలో బిందు సేద్యం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ నాణ్యమైన పంట దిగుబడిని పొందవచ్చని ఏపీఎంఐపీ ప్రాజెక్ట డైరెక్టర్ అడపా దుర్గేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బిందు, తుంపర సేద్య పరికరాలు ప్రభుత్వ రాయితీపై పొందగోరు రైతులు రైతు సేవా కేంద్రాల్లో రైతు ఆధార్ కార్డు, భూమి యాజమాన్య పత్రం నకలుతో తమ పేర్లను విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్, అగ్రికల్చరల్ అసిస్టెంట్, సిరి కల్చర్ అసిస్టెంట్ ద్వారా ఏపీఎంఐపీ యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఐదెకరాల లోపు వున్న రైతులకు 90శాతం, 5నుంచి 12 ఎకరాల పైన రైతులకు 50శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. తుంపర సేద్యానికి ఐదెకరాల లోపు వున్న రైతులకు 55శాతం, ఆపైబడిన రైతులకు 45శాతం సబ్సిడీ వర్తిస్తుందని దుర్గేష్ తెలిపారు.

సాంకేతికతకు మేధస్సు జోడిస్తే అద్భుతాలు

మాజీ జేడీ లక్ష్మీనారాయణ

దివాన్‌చెరువు, ఆగస్టు 9: సాంకేతికతకు మన మేధస్సును జోడిస్తే అద్భుతాలు సృష్టించగలమని మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. భూపాలపట్నంలోని రాజమహేంద్రి (రైట్) ఇంజనీరింగ్ కళాశాలలో ఫస్టియర్ బీటెక్ విద్యార్థులకు శుక్రవారం జరిగిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమేనన్నారు. శారీరక, మానసిక వ్యాయామాలు, మాట్లాడే విధానం, క్రమశిక్షణ వీటిని తమ జీవనశైలిలో అలవర్చుకుంటే ఎటువంటి ఒత్తిళ్లనైనా జయించి వారి లక్ష్యాలను చేరుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ ఎ.శ్రీహరి, వైస్‌చైర్మన్ టీవీఎల్ నరసింహారావు, కోశాధికారి పి.రవికిరణ్, ప్రిన్సిపాల్ బి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాడుదాం

రాజమహేంద్రవరంలో వామపక్ష పార్టీల నిరసన



రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 9: క్విట్ ఇండియా దినోత్సవం స్ఫూర్తితో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్నప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుదాం అని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం కేంద్ర కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ మాట్లాడుతూ గత పదేళ్లలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మికవర్గాన్ని అణచివేస్తూ కార్పొరేట్లకు పూర్తిగా కొమ్ము కాసిందని విమర్శించారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు మాట్లాడుతూ మోదీ విధానాలు దేశానికి ప్రమాదకరమన్నారు. కార్మిక వ్యతిరేక కోడ్‌లు రద్దయ్యే వరకూ పోరాడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కే.జోజి, కూండ్రపు రాంబాబు, కె.జ్యోతిరాజు, జువ్వల రాంబాబు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందరబాబు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మూర్తి పాల్గొన్నారు.

ఆలయాల్లో నాగపంచమి పూజలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 10: నాగపంచమి సందర్భంగా శుక్రవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నారాయణపురం దానవాయిబాబు నాగమ్మతల్లి గుడి, జాంపేట శివాలయం, గుడివీధి వరలక్ష్మి ఆలయం, కోరుకొండ రోడ్డులోని శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు నాగమ్మను దర్శించుకున్నారు.

ఆర్ట్స్ కళాశాలలో పచ్చదనం, పరిశుభ్రత

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 9: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థులు కళాశాల క్యాంపస్‌ను శుభ్రంచేశారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, ఎన్‌సీసీ సమన్వయకర్త యూసఫ్ భాషా, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త బి.మల్లికార్జున, ప్రోగ్రాం ఆఫీసర్లు, అన్ని విభాగాల వలంటీర్లు పాల్గొన్నారు.

హిరోషిమా-నాగసాకి దినోత్సవంపై అవగాహన

హిరోషిమా-నాగసాకి దినోత్సవంపై శుక్రవారం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ అణుశక్తి ప్రాధాన్యత, దుష్పరిణామాలు గురించి వివరించారు. విద్యార్థులకు క్విజ్, వక్తృత్వం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. భౌతికశాస్త్ర విభాగాధిపతి కోమల లక్ష్మి, కళాశాల అకడమిక్ సెల్ సమన్వయకర్త సంజీవ్‌కుమార్, భౌతికశాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు.

మహేష్ బాబు జన్మదిన వేడుకలు



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం కల్చరల్ ఆగస్టు 9: ఆర్యాపురం అకీరా సెంటర్‌లో సూపర్ స్టార్ మహేష్ బాబు జన్మదిన వేడుకలు ఆనంద్ (నాని)ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన సిటీ ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ, టీడీపీ నాయకుడు దొండపాటి సత్యం బాబు, రామిరెడ్డి మురళి,అల్లూరి శేషు,నారాయణ రావు, చింతం వీరబాబు హాజరయ్యారు.

డీఎస్పీ రమేష్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 9 : రాజమహేంద్రవరం సెంట్రల్ జోన్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కె.రమేష్ బాబును మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి శుక్రవారం పుష్పగుచ్ఛం అందించి అభినందలు తెలిపారు.

ఘనంగా యూత్ కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 9: యువజన కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం మంగళవారపుపేటలో ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్డర్ బాబి తొలుత కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు.అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు సున్నం చంద్రశేఖర్, గురుమూర్తి, తుమ్మూర్తి విజయ్, దల్లి వెంకటేశ్వరరావు, కాకి భాస్కరరావు, కౌజుల సాయి, నాగసాయి, కుప్పిలి యువకిశోర్ పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరుడికి బంగారు కవచం

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 9: కంబాల చెరువు కల్యాణ వేంకటేశ్వరస్వామికి దాతల సహకారంతో రూ.15 లక్షల విలువ చేసే బంగారు కవచాన్ని శుక్రవారం ఆలయ ధర్మకర్త బండారు మధుసూదనరావు సమర్పించారు.ఆలయంలో రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ చల్లా శంకరరావు, టీడీపీ నాయకులు ఆదిరెడ్డి అప్పారావు, గన్ని కృష్ణ, గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ అల్లు బాబీలను సన్మానించారు. 10,11 తేదీల్లో స్వామికి వ్రతాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యాశాఖ కమిషనర్‌ను కలిసిన రాంజీ

కడియం, ఆగస్టు 9:విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజును అమరావతిలో శుక్రవారం కడియపులంక సర్పంచ్-ఇన్‌చార్జి పాటంశెట్టి రాంజీ కలిశారు. తమ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో జరిగిన ఎస్ఎంసీ ఎన్నికలకు సంబంధించి ఎంపీపీ, సర్పంచ్, ప్రజాప్రతినిదులకు ఎవరికీ సమాచారం ఇవ్వలేదని, దీనిపై విచారణ చేయించాలని కమిషనర్‌ను కోరారు.

జాయింట్ కలెక్టర్‌గా చినరాముడు

రాజమహేంద్రవరం,ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) :జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి ఎస్.చినరాముడు నియమితులయ్యారు.ఈ మేరకు శుక్రవారం రాత్రి సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.2018 బ్యాచ్ కు చెందిన రాముడు ఎస్సీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. గత నెలలో జేసీ ఎస్.తేజ్‌భరత్‌ను బదిలీ చేసి హిమాన్స్ కౌశిక్‌ను జేసీగా నియమించినా చేరలేదు. దీంతో రాముడును నియమించారు.



సచివాలయాలకు.. చంద్రోదయం

ప్రక్షాళనకు సీఎం చంద్రబాబు నిర్ణయం

- ఉద్యోగుల సర్దుబాటుకు యోచన
- ఇక ఒక్కో సచివాలయానికి ఐదుగురే?
- మాతృశాఖలకు మిగిలిన ఉద్యోగులు
- జిల్లా వ్యాప్తంగా 512 సచివాలయాలు
- మొత్తంగా 3900 మంది సిబ్బంది
- విధివిధానాలపై దృష్టి పెట్టిన కూటమి
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామ,వార్డు సచివాలయాల్లో ఒక పనీ లేదు.. పద్ధతీ లేదు..సచివాలయాలకు రావడం వెళ్లడం అంతే.. మొత్తం సచివాలయాల్లో 11 మంది ఉంటే ఒకరిద్దరు మినహా మిగిలిన వారంతా ఖాళీయే..అయినా అలాగే జీతాలు చెల్లించారు.. అయితే కూటమి వచ్చింది.. పనితీరు మార్చింది.. సచివాలయ ఉద్యోగులకు పనిచెప్పింది..ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ అంతా వారి చేతుల మీదుగానే సాగుతుంది. ఇప్పుడిప్పుడే సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టే పని ఆరంభించింది. ఈ మేరకు సీఎం చంద్రబాబు అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రస్తావించారు.సచివాలయాలు ప్రక్షాళన చేయాలని నిర్ణయించారు. అవసరమైన మేరకు సిబ్బందిని మా త్రమే సచివాలయాల్లో కొనసాగించి మిగతా వారిని మాతృ శాఖలకు పంపించాలని యోచిస్తున్నారు. దీంతో ఆ సిబ్బంది లో ఆనందం వ్యక్తమవుతోంది.

సచివాలయానికి ఐదుగురు ఉండేలా..

జిల్లాలో మొత్తం 512 సచివాలయాలు ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లోని వార్డు సచివాలయాలు 119, గ్రామ సచివాలయాలు 393 ఉన్నాయి. మొత్తం సిబ్బంది 3900 మంది ఉన్నారు. ఇప్పుడు ప్రస్తుతానికి సచివాలయంలో 8 మంది సిబ్బంది ఉన్నారు.ఈ సంఖ్యను క్రమబద్ధీకరించాలని సూచనప్రాయంగా నిర్ణయించింది. దీనిలో భాగంగా గ్రామాల్లో ఏఎన్‌ఎం, వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్, సంక్షేమ కార్యదర్శి మహిళా సంరక్షణ కార్యదర్శులను కొనసాగించి మిగిలిన వారిని మాతృ శాఖలకు అప్పగించాలని యోచన చేస్తున్నారు. వార్డు సచివాలయాల్లో అడ్మిన్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్, సంక్షేమ కార్యదర్శి, శానిటేషన్ కార్యదర్శి, ఏఎన్‌ఎం, మహిళా సంరక్షణ కార్యదర్శులను కొనసాగిస్తారు. మిగిలిన వారిని మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖకు అప్పగిస్తారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్,అగ్రికల్చర్/హార్టికల్చర్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్ అసిస్టెంట్, పశు సంవర్థక సహాయకుల పోస్టులను రద్దు చేయనున్నారు. వారిని క్లస్టర్ విధానంలో మాతృశాఖల ఆధీనంలోకి తీసుకెళతారని సమాచారం. మాతృశాఖలకు వెళితే ఉద్యోగోన్నతులకు అవకాశం ఉంటుందని ఉద్యోగులు ఆనంద పడుతున్నారు.

ఆ శాఖకు ఇన్‌చార్జి ఎవరు?

గ్రామ, వార్డు సచివాలయాలకు జిల్లా అధికారి పోస్టును సృష్టించారు. కానీ దానికి అధికారిని నియమించకుండా డీఎల్‌డీవోలు, డీఆర్‌డీఏ పీడీలకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కాలం గడిపారు. అభివృద్ధి విభాగానికి జాయింట్ కలెక్టర్ ఉండేవారు.వారు సచివాలయ బాధ్యతలు చూసుకునే వారు.కానీ తర్వాత ఆ పోస్టును పట్టించుకోలేదు. పంచాయతీ రాజ్ శాఖలోని ఎండీవోలకు ప్రమోషన్ ఇచ్చి డీఎల్‌డీవోలుగా నియమించారు. జిల్లాలో రెండు డివిజన్లలో ఇద్దరు డీఎల్ డీవోలకు సచివాలయాల అదనపు బాధ్యత అప్పగించారు. ఇక సచివాలయాల శాఖ ఏ డిపార్టుమెంటు పరిధో ఇప్పటికీ స్పష్టత లేదు. ఈ సమస్యలన్నిటికీ కూటమి ప్రభుత్వం పరిష్కారం చూపనుంది.

నాడు వైసీపీ కార్యకర్తల్లా?

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కి రోజులు దగ్గర పడు తున్న వేళ సచివాలయ సిబ్బంది సర్దుబాటును వైసీపీ ప్రభు త్వం తెరపైకి తెచ్చింది. అప్పటికే సచివాలయ సిబ్బందిని 'అన్ని' పనులకూ వాడేసేవారు. జాబ్ చార్టు ప్రకారం నిర్వర్తించాల్సిన విధుల కంటే.. పార్టీ కార్యక్రమాలకు వినియోగించేశారు. చాలా మంది జగన్ కార్యకర్తలు అని పిలిచేవారు.. ఇదిలా ఉండగా రేషన లైజేషన్(సర్దుబాటు) అంటూ సచివాలయంలోని సిబ్బంది తగ్గింపునకు శ్రీకారం చుట్టారు.ప్రలోభాలు, బెదిరింపులతో ఓట్లు వేయించుకొనే వ్యూహంలో భాగంగా బదిలీల రంగం సిద్ధం చేశారు.తమకు అనుకూలమైన వాళ్లను 'కావాల్సిన చోటు'లో వైసీపీ నాయకులు నియమింపజేసుకున్నారు. ఇలా సచివాలయ సిబ్బంది ప్రజాసేవ కంటే వైసీపీ సేవలోనే తరించే దుస్థితిని తీసుకొచ్చారు. ఒక సచివాలయంలో సంక్షేమ అభివృద్ధి కార్యదర్శి, వార్డు పరి పాలన కార్యదర్శి, విద్యాడేటా ప్రాసెసింగ్ కార్యదర్శి, మహిళ బల హీనవర్గాల భద్రత కార్యదర్శి(మహిళా పోలీస్),ఆరోగ్య కార్యదర్శి, ప్రణాళికా నియంత్రణ కార్యదర్శి, సదుపాయాల కార్యదర్శి, పారిశుధ్య పర్యావరణ కార్యదర్శి, రెవెన్యూ కార్యదర్శి, ఇంధన కార్యదర్శి, అడ్మిన్ ఉంటారు. వీరందరినీ వైసీపీ పనులకే వాడుకోవడం జరిగేది. దీంతో అసలు వారి విధులు సవ్యంగా సాగలేదు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల గురించి ఆలోచించడం.. మాతృశాఖలకు మార్పు చేసే నిర్ణయంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

16న జాంపేట బ్యాంక్ నామినేషన్లు

రాజమహేంద్రవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి) : జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలక వర్గం ఎన్నికలు ఈనెల 25న నిర్వహించనున్నట్టు డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్, ఎన్ని కల అధికారి ఎం.జగన్నాథరెడ్డి తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం 10 బ్రాంచిల పరిధిలో సుమారు 32వేలకు పైగా ఓటర్లు 12 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటా రన్నారు.ఈ నెల 16న ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నామినేషన్ల స్వీకరణ, 17న పరిశీలన, 18న ఉపసంహరణ ఉంటుందన్నారు. 25న ఉదయం 8 నుంచి 4 గం టల వరకూ పోలింగ్ జరుగుతుందని, 26న ఎస్‌కేవీటీ కళాశాలలో ఓట్లను లెక్కిస్తామని చెప్పారు. 27న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుంద న్నారు.ఈ బ్యాంక్ చైర్మన్ పదవి రేసులో బొమ్మన జయకుమార్ ఉన్నారు.




ఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న దిశ, కొవ్వూరు డీఎస్పీలు

ఇద్దరు డీఎస్పీలు బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి)/కొవ్వూరు : దిశ(మహిళా పోలీస్ స్టేషన్) డీఎస్పీగా కడలి వెంకటేశ్వరరావు, కొవ్వూరు డీఎస్పీగా జి.దేవకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇరువురు ఎస్పీ నరసింహ కిశోర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గతంలో వెంకటేశ్వరరావు రాజమహేంద్రవరం నార్త్ జోన్ డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. తర్వాత అనంతపురం డీటీసీకి వెళ్లారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆయనను దిశ డీఎస్పీగా ప్రభుత్వం నియమించింది. డీఎస్పీ దేవకుమార్ 1991 బ్యాచ్ ఎస్ఐగా అమలాపురం టౌన్, ఉప్పలగుప్తం, అయినవిల్లి వై.రామవరం ఏజెన్సీ రాజమహేంద్రవరం టూటౌన్ ఎస్‌గా పనిచేశాను. 2006లో పదోన్నతిపై ఏసీబీ సీఐగా శ్రీకాకుళంలో 2011 వరకు పనిచేశారు. కాకినాడ టౌన్, తాడేపల్లిగూడెం, అమలాపురం రూరల్ సీఐగా పనిచేశారు. డీఎస్పీ పదోన్నతిపై విజయవాడ సీఐడీకి వెళ్లారు.అక్కడి నుంచి కొవ్వూరు డీఎస్పీగా వచ్చారు.



ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తదితరులు.. కలెక్టరేట్‌లో గిరిజన బాలికల సంప్రదాయ నృత్యం

గిరిజన విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 9 : గిరిజన విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించి భవిష్యత్తరాలకు ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం ఆర్ట్స్ కళాశాల నుంచి కంబాలచెరువు సెంటర్ వరకు ర్యాలీ చేశారు. ర్యాలీని కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహకిశోర్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. తొలుత గిరిజన విద్యార్థుల సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ మనం ఎక్కడ నుంచి వచ్చాం అన్నదానికంటే ఏమి సాధించాం అనేదే ముఖ్యమన్నారు. గిరిజన విద్యార్థులందరూ లక్ష్యాలకు అనుగుణంగా కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ గిరిజనుల కోసం కేంద్ర ప్రభుత్వం అందించే వందన్ వికాస్ యోజన పథకం జిల్లాలోను అమలు చేయాలన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు లక్ష్యాన్ని సాధించే దిశగా కృషిచేయాలన్నారు. అనంతరం పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు అందించారు. ఈ కార్యక్రమాల్లో ఇన్‌చార్జి జేసీ డీఆర్‌వో జి.నరసింహులు, రాజమండ్రి ఇన్‌చార్జి ఆర్‌డీవో కెఎల్.శివజ్యోతి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు కేఎస్.జ్యోతి, అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ మల్లిభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడు మోసగించాడని..
ఇంటర్ బాలిక ఆత్మహత్య 8



ఇసుక..ఖాళీ!

ర్యాంపుల అనుమతులకు ఎదురుచూపులు

- జిల్లా వ్యాప్తంగా ఇసుక కొరత
- స్టాక్ పాయింట్లలో ఖాళీ
- ఇంకా అక్రమంగా నిల్వలు
- కన్నెత్తి చూడని సెబ్ అధికారులు
- నేడు మంత్రి కొల్లు సమీక్ష?

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గోదావరి రేవులన్నీ బోసిపోయాయి. పడవలన్నీ ఒడ్డుకు చేరాయి. మరో పక్క ఇసుక తవ్వకాలు ఆగిపోవడంతో కొరత ఏర్పడింది. కూటమి ప్రభుత్వం ఉచిత విధానంలో ముందుగా స్టాక్ పాయింట్లలోని ఇసుక సరఫరాకు నిర్ణయించడంతో అదీ అయిపోయింది. రాజమహేంద్రవరం డివిజన్‌లో స్టాక్ పాయింట్లన్నీ ఖాళీ అవ్వగా.. కొవ్వూరు డివిజన్‌లో మాత్రం రెండు మూడు రోజులు వరకూ వస్తుందని చెబుతున్నారు.ఈ నేపథ్యంలో ఇసుక తీతకు అనుమతి ఎపుడిస్తారోనని ఒక ప్రక్క ఇసుక వ్యాపారులు, మరో పక్క వినియోగదారులు ఎదురు చూస్తున్నారు.జిల్లాలో రాజమహేంద్రవరం, కాతేరు,సీతానగరం మం డలంలో ఉన్న స్టాక్ పాయింట్లలో ఇసుక అయిపోయింది. కాతేరు, గాయత్రీ ర్యాంపుల్లో నిల్వ ఇసుక ఖాళీ అయింది. ప్రస్తుతం కొవ్వూరు మండలం కుమారదేవం, నిడదవోలు మండలం పెండ్యాల, పెరవలి మండలం ఉసులుమర్రు స్టాక్ పాయింట్లలో ఇంకా కొద్దిగా ఉంది. అధికారులు ఇంకా లక్షా 80 వేల టన్నుల వరకూ ఉంటుందని చెబుతున్నారు. అయితే కాతేరు, వెంకటనగర పరిసర ప్రాంతాల్లో చాటుమాటుగా ఇసుక అక్రమ నిల్వలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. తిరుమల కళాశాల రోడ్డులో అక్కడక్కడా గుట్టలు ఉన్నాయని చెబుతున్నారు.సెబ్ అధికారులుదృష్టిపెట్టకపోవడం గమనార్హం.

జిల్లాలో ఇసుక కొరత..

ఉసులుమర్రు స్టాక్ పాయింట్ వివాదంలో ఉంది. వైసీపీ ప్రభుత్వంలో ఉసులుమర్రు స్టాక్ పాయింట్ పెట్టడానికి ఒక రైతు వద్ద రెండు ఎకరాల భూమికి ఏడాదికి సుమారు లక్షన్నర ఇవ్వడానికి ఒప్పందం పెట్టుకున్నారు. కానీ అతనికి చాలా బాకీ ఉంది. ఇటీవల సదరు భూమి యజమాని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లగా పాత బాకీ తమకు సంబంధంలేదని చెప్పడంతో అతను ఆందోళనకు దిగాడు. ప్రస్తుతానికి నచ్చజెప్పారు. పెండ్యాల స్టాక్ పాయింట్ వద్ద సాధారణ వినియోగదారులకు కాకుండా బల్క్‌గా పెద్ద కంపెనీలకు అమ్మేస్తున్నారనే వాదన ఉంది. కోనసీమలో కూడా ర్యాంపులన్నీ మూతపడడం వల్ల గోదావరి జిల్లాల స్థానిక అవసరాలకు ఇసుక లభ్యం కావడంలేదు.ఇసుక వ్యాపారం మీద ఆధారపడిన లారీ యజమానులు ఇబ్బందులు పడుతున్నారు.అఖండ గోదావరిలో రాజమహేంద్రవరం, కొవ్వూరు వైపున సొసైటీల పేరిట ఇసుక తీసేవారు ఎక్కువ మంది ఉన్నారు. ప్రస్తుతం ఇసుక తీత ఆగిపోవడంతో ఖాళీగా ఉంటున్నారు.గోదావరి చాలా వరకూ తగ్గిందని,ఈ సమయంలో బోట్లలో ఇసుక తీసే అవకాశం ఉంటుందని బోట్స్‌మన్ సొసైటీలు చెబుతున్నాయి. కానీ దీనిపై ఇంకా జిల్లా ఇసుక కమిటీ గానీ,ప్రభుత్వం కానీ ఇంకా ఏ నిర్ణయం తీసుకున్నట్టు లేదు.గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఇసుక దోపిడీపై విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే.ఈ నెలాఖరికి ప్రాథమిక విచారణ పూర్తి కావొచ్చు. గత ప్రభుత్వంలో అక్రమాలను వెలికితీసి..ఇసుకతీత అనుమతులి వ్వడానికి కూటమి ప్రభుత్వం వేచి చూస్తున్నట్టు సమాచారం.

ఇసుక రుచి మరిగారు!?

ఇసుక రుచి మరిగిన వ్యాపారులు కేవలం పేదల పేరిట సొసైటీలను ఏర్పాటు చేసి,రూ.కోట్లు గడించడం గమనార్హం. ఏ పార్టీ అధికారంలో ఉంటే, ఆ పార్టీ వాళ్లతో సాన్నిహిత్యం సంపాదించుకుని,అధికారులతో లాలూచీపడి నిత్యం వ్యా పారం చేస్తుంటారు.ఇటీవల కాతేరు రెండు ర్యాంపుల్లో గతంలో వైసీపీ ఆధ్వర్యంలో దోపిడీ చేసిన ఆర్కే అనే వ్యక్తితో కుమ్మక్కయిన వాళ్లే ర్యాంపులలోని గుట్టలను అధిక ధరల విక్రయించడం గమనార్హం. కేవలం టన్నుకు రూ.420 మాత్రమే తీసుకోవాలని అది కేవలం ఇసుకతీత,లోడింగ్, సీనరేజ్ వంటి ఖర్చులకే అని ప్రభుత్వం చెప్పగా ఇక్కడ లారీకి అదనంగా రూ.5 వేల వరకూ వసూలు చేసినట్టు చెబుతున్నారు. ప్రస్తుతం ర్యాంపులు ఆగడంతో మళ్లీ ఇటువంటి వారంతా ఏదో విధంగా సొసైటీల పేరుతో వీటిని దక్కించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటువంటి అక్రమార్కులపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది.

నేడు మంత్రి కొల్లు రవీంద్ర రాక

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 9 : రాష్ట్ర మైన్స్ అండ్ జియోలాజికల్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర శనివారం జిల్లాలో పర్యటించనున్నారు.కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటలకు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ప్రజాప్రతినిధులు, అధికారులతో మంత్రి సమావేశం నిర్వహిస్తారు.దీనిలో భాగంగా ఇసుక విధివిధానాలపై చర్చిస్తారని తెలిసింది.

కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, ఆగస్టు 9: శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా మండలంలోని తిమ్మరాజు పాలెంలో కోటసత్తెమ్మ తల్లి దేవస్థానంలో శుక్రవారం విశేష పూజలు చేశారు. తణుకుకు చెందిన ఎన్.వెంకటగిరి శ్రీనివాసరావు, జ్యోత్స్న దంపతుల అమ్మవారికి లక్ష కుంకుమార్చన, చండీహోమం నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయంలో భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ చేసినట్టు సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.

కొవ్వూరు: కొవ్వూరు గోష్పాదక్షేత్రం, సంస్కృత పాఠశాల శివాలయంలో శ్రీలలితాపార్వతీ అమ్మవారికి అర్చకుల ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రావణ శుక్రవారం కావడంతో అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు చేరుకుని పూజలు చేశారు.

నిడదవోలు తహశీల్దార్‌గా నాగరాజు నాయక్



నిడదవోలు, ఆగస్టు 9: నిడదవోలు మండల తహశీల్దార్‌గా బి.నాగరాజు నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గుడివాడ నియోజకవర్గం నందివాడ నుంచి బదిలీపై వచ్చిన అంతకుముందు పూర్వ పశ్చిమ గోదావరి జిల్లా కలక్టరేట్‌లోను, కొవ్వూరు తహశీల్దార్‌గా విధులు నిర్వహించారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. అనంతరం ఆయన సబ్ కలెక్టర్, జిల్లా ఉన్నతాధికార్లను కలిసినట్టు తెలిపారు.

పెరవలి తహశీల్దార్‌గా అచ్యుతకుమారి



పెరవలి, ఆగస్టు 9: మండల తహశీల్దార్‌గా అచ్యుత కుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు ఆమెకు పుష్పగుచాలు అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీటీలు కనకదుర్గ, అంజిబాబు, ఆర్ఐ పావని, సర్వేయర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరం తహశీల్దార్‌గా ప్రసాద్



ఉండ్రాజవరం, ఆగస్టు 9: ఉండ్రాజవరం మండల తహశీల్దార్‌గా పీఎన్‌డీ ప్రసాద్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన కృష్ణా జిల్లా పెనుమలూరు మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ కె.నవీన్‌కుమార్ కృష్ణా జిల్లాకు బదిలీపై వెళ్లారు. తహశీల్దార్ ప్రసాద్‌కు ఆఫీసు సిబ్బంది, వీఆర్వోలు పూలమాలలతో అభినందనలు తెలిపారు.

గ్రామ స్థాయిలో బీజేపీ పటిష్టతకు కృషి

పెరవలి, ఆగస్టు 9: గ్రామ స్థాయిలో భారతీయ జనతా పార్టీని పటిష్టపరచడానికి కార్యకర్తలందరూ కృషి చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని తీపర్రులో బీజేపీ ముఖ్య నాయకులతో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో టీడీపీ, జనసేన కార్యకర్తల సమన్వయంతో పని చేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన పార్టీ మండలాధ్యక్షుడు రంగినీడి గంగాధరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రతీ కుటుంబాన్ని కలిసి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిడదవోలు-పెరవలి ఆర్అండ్‌బీ రహదారిపై ట్రాఫిక్‌పై ఎక్కువగా ఉంటుండడం వల్ల సీసీ రోడ్డుగా మార్పుచేయాలని తీర్మానించారు. సమావేశంలో కరుటూరి సుబ్బారావు, కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ : సీఐ విశ్వం



కొవ్వూరు, ఆగస్టు 9: మహిళల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తామని సీఐ పి.విశ్వం అన్నారు. కొవ్వూరు టౌన్ సీఐగా ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు మహిళా పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వచ్చిన ఆయనకు స్టేషన్ రైటర్ చంద్రాల బాబూరావు ఆధ్వర్యంలో సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం సీఐ విశ్వం డీఎస్పీ జి.దేవకుమార్, జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటివరకు కొవ్వూరు సీఐగా చేసిన వి.జగదీశ్వరరావు ఆకివీడు సర్కిల్‌కు బదిలీపై వెళ్లారు. గంజాయి విక్రయాలు, రవాణా, చోరీలను అరికట్టడానికి, రోడ్డు భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. శ్రద్ధ కనబరుస్తామన్నారు.

ముంపునకు గురైన పాఠశాల పరిశీలన

తాళ్లపూడి, ఆగస్టు 9: మండలంలోని ఇటీవల కురిసిన వర్షాలకు రాగోలపల్లి మండల పరిషత్ పాఠశాల నీట మునిగి బురదమయమైంది. విద్యార్థులు వెళ్లేందుకు సైతం ఇబ్బందులు పడుతుండడంతో గ్రామ కార్యదర్శి మండలాధికారులకు వివరించారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ పోసిరాజు, ఎంపీడీవో వెంకటరమణ శుక్రవారం పాఠశాలలను పరిశీలించారు. పాఠశాల ఆవరణ రోడ్డు కంటే లోతట్టుగా ఉండడంతో వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేదని, మెరక చేయించాలని ఉపాధ్యాయులు చెప్పారు. దీంతో ఈ సమస్యపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ, ఎంపీడీవో అన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నూతన కమిటీలు విద్యాభివృద్ధికి పాటుపడాలి

గోపాలపురం, ఆగస్టు 9: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి నూతన కమిటీలు పాటుపడాలని టీడీపీ నాయకుడు ముత్యాల రాయుడు అన్నారు. మండలంలోని దొండపూడి ఎస్ఎంసీ ఛైర్మన్ బోళ్ల రాజేష్, వైస్ ఛైర్మన్ దేవరెడ్డి వరలక్ష్మి, అలాగే ఎంపీపీ ప్రత్యేక పాఠశాల ఛైర్‌పర్సన్‌గా మల్లిపూడి శైలజ, వైస్ ఛైర్మన్‌గా కనిమేర్ల లక్ష్మీసత్యనారాయణ, సాగిపాడు ప్రభుత్వ పాఠశాలలో ఛైర్మన్‌గా పంది రాము, వైస్ ఛైర్‌పర్సన్‌గా గంపర్తి భవానీ ఎన్నికయ్యారు. వీరందరినీ రాయుడు ఆధ్వర్యంలో కూటమి సభ్యులు సత్కరించారు. అనంతరం కమిటీ సభ్యులు పాఠశాల ఆవరణలోని సరస్వతిదేవి విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో నాయకులు షేక్ హుస్సేన్, బండారు గనిరాజు, సోమరాజు, పిల్లి కృష్ణ, కడియం శ్రీనివాస్, వెల్లంకి జయశివసూర్యం, ముప్పిడి అనీల్‌కుమార్, డేవిడ్ పాల్గొన్నారు.


జనసేనలోకి చేరికలు



జనసేనలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న రామారావు

తాళ్లపూడి, ఆగస్టు 9: మండలంలోని తాడిపూడిలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శుక్రవారం తాడిపూడి విచ్చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు సమక్షంలో వైసీపీకి చెందిన కొలుకుల పెద్ద అబ్బులు.. కరిబండి అప్పన్న, గర్రే ఈశ్వరుడు, కుడిదల వెంకటేశ్వరరావు, గర్రే సత్యనారాయణ తదితర 15 మంది సభ్యులతో జనసేనలో చేరారు. అనంతరం రామారావు మాట్లాడుతూ సభ్యత్వాల పెంపు ద్వారా పార్టీ బలోపేతానికి ప్రతి జనసైనికుడు కృషి చేయాలని కోరారు. గ్రామంలో అత్యధికంగా 224 క్రియాశీలక సభ్యత్వాలు నమోదు చేసిన లింగంపల్లి సుధీర్‌కుమార్‌ను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో చెవ్వూరి బంగార్రాజు, ఆటపాకల శేఖర్, గొంతి వెంకట రమేష్, వీరిశెట్టి పోసియ్య, కొలుకుల సీతారామయ్య, పూలపల్లి బాలకృష్ణ పాల్గొన్నారు.

చాగల్లులో శ్రావణ శుక్రవారం పూజలు



చాగల్లు, ఆగస్టు 9: చాగల్లులోని శ్రీధనలక్ష్మమ్మకు శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా 108 కలశాలతో పూజలు చేశారు. ముత్తయిదువులు 108 కలశాలతో పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, పంచగంగ తీర్థాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పూవ్వులతో అలంకరించి పుష్పార్చన జరిపారు. వసంతోత్సవం జరిగింది. ఆలయకమిటీ అధ్యక్షుడు కారుమూరి గున్నేశ్వరరావు గుప్త దంపతులతోపాటు అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఉచితంగా సెల్ ఫొటోగ్రఫీ కోర్సు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 9: రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్రంలోనే తొలిసారిగా సెల్‌ఫోన్ ఫొటోగ్రఫీపై సర్టిఫికెట్ కోర్సు ప్రవేశపెడుతున్నామని కళాశాల ప్రిన్సిపాల్ ఎబెల్ రాజబాబు తెలిపారు. ఈ మేరకు కళాశాల తెలుగుశాఖాధిపతి పీవీబీ సంజీవరావు ఆధ్వర్యంలో జగతి మీడియా క్రియేషన్స్ సీఈవో శింగన నారాయణమూర్తి, డైరెక్టర్ కోమటి నాగేశ్వరరావులతో ఒప్పందం కుదిరిందని తెలిపారు. కోర్సు కోఆర్డినేటర్ సంజీవరావు మాట్లాడుతూ 50 రోజుల పాటు కోర్సు ఉచితంగా నేర్పిస్తామన్నారు. ఏ కళాశాల విద్యార్థియైనా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.

గిరిజనుల సంస్కృతిని పరిరక్షించాలి

- నన్నయ వర్సిటీ ఇన్‌ఛార్జి ఉపకులపతి శ్రీనివాసరావు
- ఘనంగా అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం
- ఆకట్టుకున్న కూచిపూడి డిప్లమో విద్యార్థుల ప్రదర్శన



నన్నయ వర్సిటీలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, ఆగస్టు 9: గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించవలసిన బాధ్యత మనందరిపై ఉందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో నన్నయ వర్శిటీ ఎన్ఎస్ఎస్ విభాగం తరపున అవగాహన, సేవా కార్యక్రమాలు నిర్వహణకు కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. గిరిజన సంస్కృతిని కాపాడే విధంగా డాక్యుమెంటేషన్ చేయాలని సూచించారు. విద్యావేత్తలు, ఓఎన్‌జీసీ వంటి సంస్థల సహకారం తీసుకుని వర్శిటీ తరపున గిరిజన ప్రాంతాల్లో మెరుగైన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఓఎన్‌జీసీ(ప్రొడక్షన్స్) జనరల్ మేనేజర్ పి.జగన్నాథరావు మాట్లాడుతూ విద్యార్థులు గిరిజనుడైన ఏకలవ్యుని వంటి ఆసక్తితో విద్యను అభ్యసించాలన్నారు. బ్రిటీష్ దొరలకు ఎదురునిల్చిన గిరిజన వీరులను, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, రాష్ట్రపతి ద్రౌపదిముర్ము వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గిరిజనులకు నాణ్యమైన విద్య ఉద్యోగవకాశాలతో బాటు ఉపాధి అవకాశాలను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో మార్కెట్ వసతులు కల్పించాలని సూచిస్తూ గిరిజన చట్టాలను వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ఐటీడీఏ అందిస్తున్న సేవలను తెలియజేస్తూ వాటిని మరింత మెరుగుపరచాలని సూచించారు. తొలుత జ్యోతిని వెలిగించి అతిథులు కార్యక్రమం ప్రారంభించారు. గిరిజన సంస్కృతిని ప్రతిబింబిస్తూ కూచిపూడి డిప్లమో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, కార్యక్రమ కన్వీనర్ పి.విజయనిర్మల, ఎన్ఎస్ఎస్ పీవోలు శీలం రాజ్యలక్ష్మి, ఎం.సుజాత, ఆర్ఎస్ వరహాలదొర, బాలసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మానవజాతి మనుగడకు మూలం ఆదివాసీలే : మద్దిపాటి

గోపాలపురం, ఆగస్టు 9: మానవజాతి మనుగడకు మూలం ఆదివాసీలేనని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గం బుట్టాయిగూడెం మండలం కేఆర్ పురం ఐటీడీఏ వద్ద జరిగిన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడినట్టు చరవాణిలో తెలిపారు. భారతీయ చరిత్రలో గిరిజన సాంప్రదాయానికి ఎంతో ప్రాచుర్యం ఉందని, మారుతున్న సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని ఆర్థిక, రాజకీయ, ఉద్యోగ రంగాల్లో ఆదివాసీలు పోటీపడే తత్వాన్ని అలవరుచుకోవాలన్నారు. ఏజెన్సీలో స్వచ్ఛమైనీరు, గాలి, ఆహారం తీసుకుని గిరిజనులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉన్నారని, పట్టణాలకు వెళ్లి ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దని అన్నారు.

ఆదివాసీ సంక్షేమంపై చర్చించాలనేదే ఉద్దేశం : ముప్పిడి

కొవ్వూరు, ఆగస్టు 9: కొవ్వూరు మండల విద్యా వనరుల కేంద్రం ప్రాంగణంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని సభాధ్యక్షుడు పొట్లూరి గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాలకపక్షాలు ఆదివాసీ సంక్షేమం, ఇబ్బందులపై చర్చించాలనే ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం అన్ని జిల్లాల్లో అధికారికంగా ఆదివాసీల దినోత్సవాన్ని నిర్వహించిందన్నారు. యానాది కాలనీ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మత్స్యకార సొసైటీల్లో ఉన్న యానాదులకు చేపల వలలు, మోటారుసైకిళ్లు, ఐస్‌బాక్స్‌లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలను తప్పనిసరిగా చదివించాలని, దొంగిలించని ఆస్తి చదువు ఒక్కటేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ బావన రత్నకుమారి, దాయన రామకృష్ణ, నంబూరి శ్రీమన్నారాయణ, ఈమని మల్లిక, నక్కా వెంకటరత్నం, పెనుమాక జయరాజు, వేమగిరి వెంకట్రావు, సంఘం అధ్యక్షుడు కె.గోపాలం తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో ఎమ్మెల్యే ముప్పిడికి వినతిపత్రం అందజేస్తున్న యానాది నాయకులు



కేఆర్.పురం ఆదివాసీ దినోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

లీజు బకాయి రూ.3 లక్షలు చెల్లిస్తేనే ఎగుమతులు

- తీపర్రులో ఇసుక రవాణా అడ్డుకున్న లీజుదారుడు
- నిడదవోలు-నరసాపురం రహదారిపై నిలిచిన లారీలు
- అధికారుల చర్చలు.. సాయంత్రం ఎగుమతులు ప్రారంభం



భూమి లీజుదారుడు సత్యనారాయణతో చర్చలు జరుపుతున్న ఎస్ఐ అప్పారావు, డీటీ కనకదుర్గ

పెరవలి, ఆగస్టు 9: తీపర్రు, ఉసులుమర్రు ఇసుక స్టాక్‌పాయింట్ వద్ద శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో నిడదవోలు-నరసాపురం రహదారిపై కిలో మీటరు పొడవున లారీలు నిలిచిపోయాయి. ఉసులుమర్రుకు చెందిన వీరమల్లు సత్యనారాయణ తనతోపాటు మరికొందరికి ఇసుక నిల్వ చేసిన ప్రదేశంలో భూమికి లీజు సొమ్ము రావాల్సి ఉందని, రెండేళ్ల క్రితం అప్పటి కాంట్రాక్టర్లు, ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నామని, తనకు ఇప్పటివరకు సొమ్ములు అందలేదని ఆరోపించారు. ఇసుక ఎగుమతులు చివరి దశకు చేరుకున్నందున తనకు సొమ్ములు చెల్లించిన అనంతరమే ఇసుక ఎగుమతులు చేయాలని అడ్డుకోవడంతో ఎగుమతులకు అంతరాయం కలిగింది. డీటీ కనకదుర్గ, ఎస్ఐ అప్పారావు, స్టాక్‌పాయింట్ వద్దకు చేరుకుని సత్యనారాయణతో చర్చలు జరిపారు. జూన్ నెలకు మాత్రమే తాము లీజు సొమ్ము చెల్లించగలమని గతం నుంచి ఉన్న బకాయితో తమకు సంబంధం లేదని పేర్కొన్నారు. దీంతో అదెంత వరకు న్యాయమని, తనకు బకాయి పడ్డ సొమ్ము సుమారు రూ.3 లక్షలు చెల్లించాలని లీజుదారుడు డిమాండ్ చేశారు. లేకుంటే ఎగుమతులు ఆపి వేయాలని భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళతామని, ఎగుమతులు నిలిపి వేయడం సరికాదని డీటీ, ఎస్ఐ చెప్పారు. దీంతో కొంత మెత్తపడిన సత్యనారాయణ శనివారం తమ సమస్య పరిష్కరించాలని కోరారు. దీంతో మధ్యాహ్నం ఎగుమతులు ప్రారంభమయ్యాయి.



నిడదవోలు-నరసాపురం రహదారిపై ఆగి ఉన్న లారీలు

గర్భిణులకు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

నల్లజర్ల, ఆగస్టు 9: గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ కలిగి ఉండాలని కోయలగూడెం సురక్ష వైద్యురాలు వేదమణి అన్నారు. శుక్రవారం పోతవరం పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభయాన్ కార్యక్రమంలో కోయ్యలగూడెం సురక్ష ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ డాక్టర్ వెంకట్రావుతోపాటు డాక్టర్ వేదమణి 58మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందించారు.కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఏలేటి సత్యనారాయణ, సూపర్‌వైజర్ సత్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ఉధృతంగా గోదావరి



కొవ్వూరు, ఆగస్టు 9 : ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. భద్రాచలం వద్ద గురువారం 38.6 అడుగులకు గోదావరి వరద పెరిగింది. అనంతరం నిలకడగా ప్రవహిస్తూ క్రమేపి తగ్గి 33 అడుగులకు చేరింది. ఎగువన ఉన్న వరద ప్రవాహం దిగువన ధవళేశ్వరం బ్యారేజ్ చేరుకోవడానికి సుమారు 18 గంటల సమయం పడుతుంది. శుక్రవారం సాయంత్రం కాటన్ బ్యారేజ్ నుంచి 6,81,702 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుండగా నీటిమట్టం 9.40 అడుగులుగా నమోదైంది.సాగునీటి అవసరాలకు తూర్పు డెల్టా ప్రధాన పంట కాలువకు 2 వేల క్యూసెక్కులు, మధ్య డెల్టా ప్రధాన పంట కాలువకు 1500 క్యూసెక్కులు,పశ్చిమడెల్టా ప్రధాన పంట కాలువకు 2 వేల క్యూసెక్కులుచొప్పున విడుదల చేస్తున్నారు.భద్రాచలం వద్ద శుక్రవారం సాయంత్రానికి నీటిమట్టం 33 అడుగులకు చేరుకుంది. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో స్నానఘట్టాలపై ఉన్న శివలింగాలను వరద గోదావరి ముంచెత్తింది.

ప్రేమ విఫలం.. బాలిక ఆత్మహత్య



లక్ష్మి మృతదేహం

నల్లజర్ల, ఆగస్టు 9: ప్రేమ విఫలం కావడంతో ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నల్లజర్ల మండలం ఘంటా వారి గూడెంలో జరిగింది. ఘంటా వారి గూడేనికి చెందిన పెనుమాక శ్రీనివాసరావు, సుశీల దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహం కాగ చిన్న కుమార్తె లక్ష్మి(17) ఇంటర్ ప్రైవేటుగా చదువుతూ దూబచర్ల కాశీ మందుషాపులో పని చేస్తోంది. పక్కనే సెలూన్ షాపు నిర్వహిస్తున్న ఉంగుటూరు మండలం ఎర్రమిల్లిపాడు గ్రామానికి చెందిన శ్రీనుతో ప్రేమలో పడింది. ఇద్దరూ తరచు కలుస్తుండేవారు. ఇంట్లో విషయం తెలియడంతో వివాహం చేసుకోవాలని లక్ష్మి ఒత్తిడి చేయగా శ్రీను మొహం చాటేశాడు. తాను మోసపోయానని మనస్తాపం చెందిన లక్ష్మి తన తల్లిదండ్రులు కూలీ పనికి వెళ్లిన తరువాత మధ్యాహ్నం ఫోన్ చేసి మిమ్మలను చివరిసారిగా చూడాలనిపిస్తోంది త్వరగా ఇంటికి రండి చెప్పింది. తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ విగతాజీవిగా కనిపించింది.స్థానికుల సహకారంతో లక్ష్మిని దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్టు స్థానిక వైద్యులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ స్టాలిన్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలిస్తుండగా బంధువుల అడ్డుకున్నారు. దీంతో సీఐ దుర్గాప్రసాద్ అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ప్రేమికుడు శ్రీను వచ్చి లక్ష్మి కుటుంబానికి న్యాయం చేసే వరకు ఇక్కడే ఉంచాలని మధ్యాహ్నం నుంచి సాయంత్రం 7గంటల వరకు అడ్డుకున్నారు. ఇరు వర్గాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి.

ఏటీఎం కార్డులు మార్చి దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

బైక్, ఏటీఎం కార్డులు సీజ్

కొవ్వూరు, ఆగస్టు 9: ఏటీఎం కార్డు మార్చి నగదు దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. నిడదవోలులోని రాయపేటకు చెందిన నిచ్చెనకోళ్ళ శివరామకృష్ణ ఏటీఎంల వద్దకు వచ్చే వృద్ధులను, డబ్బులు తీయడం రాని వాళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతుంటాడు. డబ్బు తీయడం రానివారు ఏటీఎంనుంచి డబ్బు తీయమని కార్డు ఇవ్వగా తప్పుడు పిన్ ఎంటర్ చేసి డబ్బు రావడం లేదని, అసలు కార్డుకు బదులుగా డూప్లికేట్ కార్డు ఇచ్చి అక్కడ నుంచి వెళ్లిపోతాడు. వేరొక ఏటీఎంల నుంచి డబ్బు విత్‌డ్రా చేసి జల్సా చేస్తుంటాడు. కొవ్వూరు మండలం పంగిడి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి రేలంగా నారాయణరావుకు చెందిన ఏటీఎం కార్డు మార్చి రూ.33,500 దొంతనం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శివరామకృష్ణపై రాజమహేంద్రవరం, విజయవాడ, కొవ్వూరులలో ఏడు కేసులున్నాయన్నారు. నిందితుడిని అరెస్టు చేసి మోటారుసైకిల్, దొంగతనానికి ఉపయోగించిన ఏటీఎం కార్డులను సీజ్ చేసినట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు. నగదు డ్రా చేయడానికి ఏటీఎంల వద్దకు వెళ్లినప్పుడు అపరిచితులకు ఏటీఎం పిన్ నెంబరు చెప్పవద్దన్నారు.

కొవ్వూరులో బాలుడి అదృశ్యం

గంట వ్యవధిలో తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



మిద్దే వర్షిత్

కొవ్వూరు, ఆగస్టు 9: అదృశ్యమైన బాలుడిని గంట సమయంలో తల్లితండ్రులకు అప్పగించినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన ఆరేళ్ల బాలుడు మిద్దే వర్షిత్ ఇంటి వద్ద ఆడుకుంటూ పక్కవీధిలోకి వెళ్లిపోయాడు. శుక్రవారం రాత్రి 7గంటల నుంచి కనిపించడం లేదని తండ్రి సతీష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ జి.దేవకుమార్ ఆధ్వర్యంలో టౌన్ సీఐ పి.విశ్వం, ఎస్ఐ కె.జగన్మోహన్ తమ సిబ్బందితో ఇందిరమ్మ కాలనీ, అచ్చాయమ్మ కాలనీలో విచారణ చేపట్టారు. గంట వ్యవధిలోనే అదృశ్యమైన బాలుడిని అచ్చాయమ్మ కాలనీలో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించినట్టు సీఐ తెలిపారు.


రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలి

కొవ్వూరు, ఆగస్టు 9: జాతీయ లోక్ అదాలత్‌లో రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవాలని మేజిస్ట్రేట్ జి.సాయికృష్ణ అన్నారు. సెప్టెంబరు 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌పై పోలీసు అధికారులతో శుక్రవారం కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. ఏయే స్టేషన్లలో ఎన్ని కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయో, ఎన్ని రాజీమార్గంలో పరిష్కారానికి గుర్తించారో అడిగి తెలుసుకున్నారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు టౌన్, రూరల్, తాళ్లపూడి, గోపాలపురం, దేవరపల్లి పోలీసులు పాల్గొన్నారు.

వేగేశ్వరపురంలో హర్ ఘర్ తిరంగా

తాళ్లపూడి, ఆగస్టు 9: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేయాలని ఎంపీడీవో వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద గ్రామస్థులకు అవగాహన కలిగిస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈవోలు బాలామణి, నెహ్రూజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యహాస్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో ర్యాలీ



ఉండ్రాజవరం, ఆగస్టు 9: విద్యార్థుల్లో దేశభక్తిని, స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపడానికి ఉండ్రాజవరంలో హర్‌ఘర్ తిరంగ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పొడవాటి జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో జేడీపీ ప్రసాద్, ఎంఈవోలు సక్సేనరాజు, శారదజ్యోత్స్న, ఏఈ, భవాని, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లను నిరంతర పరిశీలించాలి

నల్లజర్ల, ఆగస్టు 9: విద్యుత్ లైన్లను నిరంతర పరిశీలించాలని విద్యుత్ శాఖ అధికారి సాల్మన్‌రాజు సిబ్బందికి సూచించారు. శుక్రవారం నల్లజర్ల మండలం చీపురుగూడెం సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన ఆయన క్షేత్ర స్థాయి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ట్రీ కటింగ్‌పై వివరాలు తెలుసుకున్నారు. సబ్‌స్టేషన్ నిర్వహణ, పనితీరు, విద్యుత్ లైన్లు పరిశీలించారు. వర్షాకాలంలో చెట్లు ఎక్కువగా విద్యుత్ లైన్‌లపై పడే అవకాశం ఉందని, ముందుగానే చెట్ల కొమ్మలను విద్యుత్ లైన్‌లకు అడ్డులేకుండా తొలగించాలని చెప్పారు. కార్యక్రమంలో ఈఈ వీరాభద్రరావు,ఏడిఏ రాము, ఏఈ బాపిరాజు పాల్గొన్నారు.